కుష్ఠు క్రిములను కనుగొన్న శాస్త్రవేత్త

డాక్టర్ హేన్సన్ జీవితం-పరిశోధన



సంకలనం

పెద్ది సాంబశివరావు

నార్వే దేశానికి ఒక ప్రత్యేకత వుంది. ప్రపంచపటంలో చూస్తే యూరప్ ఖండంలో పై భాగాన కనిపించే ఈ చిన్న దేశం నిలబెట్టిన వీణ ఆకారంలో వుంటుంది. దీనిని అర్ధరాత్రి సూర్యుడుండే దేశం అంటారు. ఈ దేశపు ఉత్తర అంచున మే నెల మధ్య మంచి జూలై ఆఖరు వరకు సూర్యుడు అస్తమించడు. నవంబరు ఆఖరు నుంచి జనవరి ఆఖరు వరకు సూర్యుడే కనిపించడు.

ఆ దేశ ప్రజలకు వ్యవసాయం, చేపల వేట ప్రధాన ఆదాయాన్ని ఇచ్చే వృత్తులు, వ్యాపారాలు. అక్కడ 1841 సంవత్సరంలో బెర్గెన్ అనే నగరంలో జి.ఏ. హేన్సన్ పుట్టాడు. అతనే పెరిగి పెద్దవాడయి గొప్ప శాస్త్రపరిశోధనలు చేసి, ప్రజలు ఎంతో భయపడే కుష్టువ్యాధి ఎందువల్ల కలుగుతుందో కనిపెట్టాడు.

ఆరో ఏటనే నగరానికి దూరాం వున్న మేనమామల వ్యవసాయ క్షేత్రం వద్దకు పంపబడ్డాడు. అక్కడ ఇద్దరు అత్తయ్యల దగ్గర అక్షరాలు దిద్దుకొని లెక్కలు ప్రారంభించాడు. కాని వాళ్ళు క్రమశిక్షణతో చదువు చెప్పనందున కాస్త చెడిపోయాడు.

ఒకప్పుడు అన్ని విధాల కలిగిన కుటుంబం వారిది. అయినా పెద్ద కుటుంబము కావటం వల్ల చేతనయినవరకు పొలం పని చేయక తప్పదు. పశువుల పాలు పితకడంలో పాలేర్లకు తోడు వెళ్ళేవాడు. (స్కేటింగు) మంచుపై జారే ఆట డి బలిష్టంగా తయారయ్యాడు. వాళ్ళ నాన్న మంచి శ్రమజీవి. ఆయన పిల్లలు పదిమంది కూడా కష్టించి పనిచేసేవాళ్ళు.

చదువుకోసి నగరానికి పంపారు హేన్సన్ ను. అక్కడ పిల్లలు అతనినివేళాకోళం చేసి ఏడిపించారు. అతను తన కండబలంతో వాళ్ళనుఎదుర్కొన్నాడు. తరువాత చదువు బాగా వచ్చింది. తండ్రి కూడా ఇంటివద్ద పాఠాలు చెపుతుండేవాడు. కొడుకులు బాగా అభివృద్ధిలోకి రావాలని ఆశించేవాడాయన. ఈ ఆశ అందరు తండ్రులకూ వుంటుంది. కాని ఈయనకు కాస్త ఎక్కువ, అమ్మవినయవిధేయతలు నేర్పింది. వాళ్ళ కుటుంబ సభ్యులంతా చర్చికి వెళ్ళేవాళ్ళు. ఆ కాలంలో ధార్మికోపన్యాసాలను ప్రతి రెండో అదివారం నాడుజర్మన్ భాషలో చేసేవాళ్ళు.

ఇంట్లో ఎక్కువమంది మనుషులున్నా, క్రమశిక్షణ లోపం వుండదు. వాళ్ళ నాన్న ముక్కోపి. కాని ఆ కోపం ఎంతోసేపు వుండదు. పిల్లలు ఇంటివద్ద చేయవలసిన వ్రాతపని చేసుకున్న తరువాత ఎంతసేపు ఆడుకున్నా ఏమీ అనడు.

ఇక్కడ చదువు అంతా సంతృప్తికరంగా ముగించుకున్నాడు. యూనివర్శిటీ ప్రవేశ పరీక్షలు వ్రాయటానికి నౌకపైన ఆస్లో నగరానికి బయలుదేరాడు. దారిలో మరికొందరు విద్యార్థులు కలిశారు. హేన్సన్ వయసువాళ్ళు అప్పుడే ప్రేమ కలాపాలలో లీనమైనారని తెలుసుకొని ఆశ్చర్యపడ్డాడు.

విషయం క్షుణ్ణంగా చదివాడు గనుక పరీక్షలంటే భయం లేదు. క్రొత్త వ్యక్తులతో పరిచయాలు కావడం ఆనందాన్ని కలిగించింది. ఎంట్రెన్సు ప్యాసయి యూనివర్శిటీలో చేరాడు.

మొదటిసారిగా సామాన్య శాస్త్రబోధన ప్రారంభమయింది. పాఠశాలలో ఆయన ఆ అంశాన్ని చదవలేదు. తత్త్వ శాస్త్రం కూడా వుండేది. ఆపాఠాలంటే విసుగ్గా వుండేది. జంతు శాస్త్రపు తరగతులకు క్రమం తప్పకుండా హాజరయ్యే వాడు. ఎంత తెలుసుకున్నా ఇంకా ఇంకా తెలుసుకోవాలని తపన, ఆరాటం వుండేది.

వాళ్ళ తండ్రి ఆస్తిపరుడయినా పెద్ద కుటుంబము గనుక డబ్బు ఎక్కువ మిగిలేదికాదు. విద్యార్థిగా వుంటూగూడా సొంతంగా కొంత సంపాదించాలని ప్రయత్నించాడు హేన్సన్. ఒక మంచి ఇంట్లో ట్యూషను చెప్పే అవకాశం దొరికింది. ఆ ఇంటివాళ్ళు చాలా సహాయాలు చేసి ఇతనిని మిత్రునిగా చూసుకున్నారు.

తరువాత ఒక బాలికల పాటశాలలో రోజూ కొన్ని గంటలు బోధించే పనిదొరికింది. కాని ఆడపిల్లలకు సైన్సు పాఠాలు చెప్పాలంటే ఇబ్బందిగా వుండేది. పిల్లలు కూడా శ్రద్ధగా వినేవాళ్ళుకారు. ఆయన వాడే ఊతపదాలను పట్టుకొని అరుస్తూ అల్లరి చేసేవాళ్ళు.

రసాయనశాస్త్రం చెప్పినా అంతే ` వాళ్ళకేమీ తలకెక్కేది కాదు. పోనీ బటయకు తీసుకుపోయి ప్రకృతిలోని చెట్టుచేమలను, జంతుజాలాన్ని చూపి నేర్పుదామన్నా అదీ అంతే.

తరువాత పంటకాల గురించి చెప్పమన్నది. ప్రధానోపాధ్యయుని. ఆ విషయం ఆయనకు అసలు రాదు. అందువల్ల ఉద్యోగం నుంచి ఇంటికి పొమ్మన్నారు.

దాంతో ఆయన పరిస్థితి దయనీయంగా తయారయింది. ఉద్యోగం కోసం యాచిస్తూ మూడు రోజుల పాటు ఇల్లిల్లూ తిరిగాడు. ప్రయోజనం లేకపోగా నిరాశ, నిస్పృహలతో గదికి తిరిగి వచ్చాడు. ఒక నిరుద్యోగ యువకుని బాధ, కోపం ఎలా వుంటుందో అర్ధమయింది. ఇక ఇంటికివెళ్ళి కన్న వాళ్ళకు భారంగా కాలం గడపక తప్పదు అనుకున్నాడు.

అదృష్టవశాత్తు ఈ దుర్దినాలు తొందరలోనే తొలగిపోయాయి. ఆస్లోలో తనకు పాఠాలు చెప్పిన ఒక లెక్చరరు విదేశాలకు వెళుతున్నాడు. ఆయన స్థానంలో తాత్కాలికంగా ఉద్యోగంలో చేరమని పిలుపు వచ్చింది. యూనివర్సిటిలో ఆయన గదిలోనే ఒక మంచదం ఇచ్చారు. నెలకు 15 డాలర్ల జీతం. అదొక గొప్ప అదృష్టం అనుకుంటూ వెళ్ళి చేరాడు.

అక్కడ విద్యార్థులు తన వయసువాళ్ళే. ఇపుడు తాను అధ్యాపకుడిగా, మార్గదర్శిగా వారికి పాఠాలు బోధించడం అంత సులభమైన విషయం కాదు. శరీరధర్మ శాస్త్రాన్ని, శరీర నిర్మాణ శాస్త్రాన్ని క్షుణ్ణంగా చదువుకున్నాడు. క్లాసులోని విద్యార్థులు ఎరవైనా ప్రాక్టికల్సు చేయలేకపోతే ప్రక్కపిల్లలచేత సహాయం చేయించేవాడు, తాను గూడా చెప్పేవాడు. అందువల్ల విద్యార్థులలో ఆయపట్ల గౌవరభావం పెరిగింది. క్రమశిక్షణాలోపాన్ని ఆయనసహించదు. శవాలనుకోయడంలో విద్యార్థులకు ఉన్న భయాలను తగ్గించి, ఆసక్తిని పెంచగలిగాడు.

కొందరికి అనాటమీ ట్యూషన్లు చెప్పేవాడు. వాళ్ళు డబ్బు బాగానే ఇచ్చేవాళ్ళు. మరొక బాలుర పాఠశాలలో పాఠాలు చెప్పేవాడు. అక్కడొక తమాషా జరిగింది. హేన్సన్ ఒకటో తరగతికి సైన్సు పాఠాలు చెపుతుంటే ఆయన దగ్గర అనాటమీ చదివే విద్యార్థిపై తరగతులకు పాఠాలు చెప్పాడానికి కుదిరాడు.

స్కూలులో గూడా పిల్లల మనస్తత్వాలను అర్థం చేసుకొని అసక్తికరంగా పాఠాలు చెప్పేవాడు. కేవలం పుస్తకాలు చదివితే వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం వంటివి అర్థంకావు. అందుకని పిల్లల చేత కథలు చెప్పిస్తూ, తాను చెపుతూ వాటిని బోధించేవాడు.

హేన్సన్ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చేవాడు. ఆయన ఉద్యోగంలో చేరిన కొత్తలో పిల్లలు మురికి చేతులతో, జిడ్డుగారే ముఖాలతో ఉండేవాళ్ళు. అవసరమైతే దండించి వాళ్ళకు పరిశుభ్రత నేర్పాడు. పై తరగతుల విద్యార్థులకు పక్షులు,జంతువుల కళ్ళు కోసే భాగాలను వివరించి చూపేవాడు. దీనిపట్ల విద్యార్థుల్లో శాస్త్రం పట్ల ఆసక్తి కలగడమే కాక విజ్ఞాన అవగాహన కూడా మెరుగయింది. అబద్ధం ఆడటం పిరికితనానికి సంకేతం అనేవాడు. పిల్లలు తప్పుచేస్తే వెంటనే దండించేవాడు. నిప్పు పట్టుకుంటే కాలినట్లుగా నేరానికి శిక్ష వెంటనే విధిస్తే గుర్తుంటుంది. సరయిన కారణం వుండి దండిస్తే ఏ కుర్రవాడూ బాధపడదు.

ఆయన ఆస్లో పట్టణానికి వచ్చిన క్రొత్తలో మతబోధకుడైన వాళ్ళ అన్నయ్య దగ్గర ఉండేవాడు. అప్పుడు రోజూ రెండు పూటలూ ప్రార్థనలు చేసేవాడు. ప్రతి ఆదివారం చర్చికి వేళ్ళేవాడు. కాని కొంత కాలానికి తన పని తనకే నచ్చలేదు. ఏవేవో కోరికలతో ప్రార్థనలు చేయడం, తప్పులు వప్పుకోవడం అన్నీ ఆత్మవంచనలు అనిపించ సాగింది. క్రమంగా మతమౌఢ్యపు మబ్బులు విడిపోయాయి. ''నిరాశ వరించినపుడు, బాధలు కల్గినపుడు భగవంతుడిని హృదయపూర్వకంగా వేడుకున్నాడు. నాకు జ్ఞానోదయం కలిగిచమన్నాను. కానీ ఏమీ మార్పులేదు. అపుడు నాకు అనుమానం వచ్చింది. నేనుప్రార్ధన చేసే విధానం సరయినది కాదేమోననను కున్నాను. ఎంతో బరువెక్కిన హృదయంతోనా వేదనలను నివేదించుకున్నాను. కాని ఫలితం లేదు. దాంతో సందేహం ధృడపడింది. దేవుడి ఉనికిమీద, ప్రార్థనా బలంమీద నమ్మకం పోయింది. ఆపదలో వున్న భక్తుని ఆదుకోలేనివాడుచెడ్డ భగవంతుడైనా అయివుండాలి,లేదా అసలుభగవంతుడే లేకపోవాలి. ఇపుడు నేను రెండవదే నిజం అనుకుంటున్నాను. ఎందుకంటే ఆయన వున్నదాఖలాలు లేవు గనుక'' అన్నాడాయన కొన్నాళ్ళ తరవాత.

తరువాత రెట్టించిన ఉత్సాహంతో, తీవ్రతతో మళ్ళీ వైద్య విద్యను అభ్యసించాడు. నేర్చుకోవాలనే తపనవల్ల అన్ని ఇబ్బందులునూ భరించాడు. ఒకవంక తన పనిని పూర్తి చేసుకుంటూనే మరో వైపు అంతగా ఆసక్తిలేని తోటి విద్యార్థులకు కూడా సహాయం చేసేవాడు. గురువుల వల్ల తెలుసుకున్నదానికంటే స్వయంగా గ్రహించిన విజ్ఞానం వల్ల ఎక్కువ తృప్తి వస్తుంది. అదే చిరకాలం అనుభవంగా గుర్తుంటుంది.

విద్యార్థులలోనూ, అధ్యాపకులలోనూ రకరకాల వాళ్ళు ఉంటారు. అక్కడి వారిలో వివాదాస్పదమైన విద్యార్థి హేన్సన్. అనుభవం గల అధ్యాపకులతో సమానంగా, కొందరికంటే ఎక్కువగా కూడా విషయాలు తెలుసు అతనికి. దీనికితోడుఒక క్రొత్త అధ్యాపకుడు ఆధునిక విషయాలను బాగా చెప్పేవాడు. కొందరు ఉపాధ్యాయులు మాత్రం వాళ్ళకు తెలిసింది గాకమరేమీ విజ్ఞానం లేదన్నట్లుగా కూర్చునేవాళ్ళు. మరికొందరు వయసు మళ్ళిన వాళ్ళు 'ఇంకేం నేర్చుకుంటాములే' అని తాత్సారంగా ఉండేవాళ్ళు. డాక్టర్ ఎ.జి.బెర్గ్ మాత్రం అందుకు మినహాయింపు.

ఆయన రిటైరయిన తర్వాత కూడా రోజూ ఆసుపత్రికి వచ్చి క్రొత్త క్రొత్త అంశాలు ఏమేమీ వెలుగులోకి వస్తున్నాయోతెలుసుంటుండేవాడు. మరో అధ్యాపకుడు కూడా మేధావే. కాని విద్యార్థులకు ఆయన దగ్గర చనువు లేదు. ఆరు నెలల్నుంచి తన దగ్గర చదివిన వాళ్ళ పేర్లు గూడా ఆయనకు తెలియదు. వయస్సుతో పాటు కాస్త చాదస్తం కూడా పెరుగుతుందేమో. క్రొత్త పుస్తకాలలోని విషయాలను అడిగితేకోపపడేవాడు. హేన్సన్ వీళ్ళందరినీచూసి ఒక విషయం గ్రహించాడు. పాత లెక్చరర్ల పాఠాలు వినడంకంటె క్రొత్త పుస్తకాలు చదువుకోవడం మేలని ` వాళ్ళు ఒకే విషయాన్ని పదేపదేచెప్పడం , ఒక్క మాటకూడా మార్పు చేయకుండా అప్పుజెప్పినట్లుగా పాఠాలు చెప్పడం ఆయనకు నచ్చేది కాదు.

అందరూ అలాటి ఆచార్యులే అనుకోగూడదు. హైబర్గ్ అనేఆయన ప్రతి విద్యార్థి పట్ల ప్రతేక శ్రద్ధ చేపేవాడు. ఆయన మారు పేరు 'కత్తి' . మారుపేరుతోనే ఆయన బాగా పరిచితుడు. విద్యార్థులు స్వంత పరిశీలనద్వారా విషయాలను నేర్చుకోడానికి సహకరించేవాడు. అంత అనుభవంకలవాడైనా ఎప్పుడైనా తన వల్ల పొరపాటు దొర్లితే వెంటనే అంగీకరించేవాడు. ఆ గొప్ప లక్షణం పట్లవిద్యార్థులు ఆశ్చర్యపోయేవాళ్ళు.

హేన్సన్ కూడా ముక్కు సూటిగా పోయే వ్యక్తి. ఎదుటి వాళ్ళ మెప్పు కోసం ఆత్మ వంచన చేసుకోలేదు. ముఖ ప్రీతిమాటలు చెప్పటం చేతగాదు. ఒకసారి ఆయనకుపరీక్ష జరుగుతుంది. ప్రొఫెసరు గారు ఒక కంటి జబ్బు గల రోగిని చూపించి దానికిచికిత్స ఏమిటని ప్రశ్నించాడు. ఆ ప్రొఫెసరుకు ఇష్టమైన ఆపరేషన్ ఒకటి ఉంది. హేన్సన్ దానిని గురించే చెపుతాడని ప్రొఫెసరు

ఆశించాడు. కాని హేన్సన్ కు దాంట్లోనమ్మకం లేక దాని విషయం ఎత్తలేదు. ప్రొఫెసరు ఆగలేక తనకు ఇష్టమైన ఫలానా ఆపరేషన్ను చేస్తే ఎలావుంటుందని అడిగాడు. హేన్సన్ తడుముకోకుండా''అది ఈ రోగికి ఉపయోగపడదండీ'' అన్నాడు. ప్రొఫెసరుకుకోపం బుసలు కొట్టింది. తనను అవమానపరచినట్లుగా బాధపడ్డాడు. సరే వెళ్ళమని ''సున్నా'' మార్కులువేశాడు. హేన్సన్అది చూసి తిరగమల్లాడు. పరీక్ష బల్లముందే గురుశిష్యులు చిన్న పిల్లల లాగా పోట్లాడుకున్నారు. ''సున్నా'' మార్కులు వేయగూడదనగా పదకొండు వేశాడు. దాదాపు విద్యార్థులతా హేన్సన్ ను సమర్ధించారు. ఆవేశం తగ్గిన తర్వాత హేన్సన్ వెళ్ళి తన దురుసుతనానికిక్షమాపణ చెప్పుకున్నాడు. కాని ప్రొఫెసరు ప్రసన్నుడు కాలేదు.

1867లో మెడిసన్ ఆఖరు సంవత్సరం పరీక్షలు వ్రాశాడు. ఒక ఏడాదిపాటు హౌస్ సర్జనుగా ప్రభుత్వ హాస్పటల్ లో చేరాడు. జ్ఞాన సముపార్జన లోనూ, సంతృప్తి కలిగించడం లోనూ అది ఆయనకు మరపురాని సమయం.

మతానికీ, జీవశాస్త్రానికీ ఉన్న సంబంధం ఏమిటా అని అప్పుడప్పుడు ఆలోచించేవాడు. ఏమీతోచేది కాదు. తన అస్పష్ట ఆలోచనలకు అంతు దొరుకుతుందేమోనని ఒక డేనిష్ ప్రొఫెసరు గారు ఈ అంశంపై చేసిన ప్రసంగాన్నిశ్రద్ధగా విన్నాడు. కాని నిరాశ మాత్రమేమిగిలింది. మతం పేరుతో మౌఢ్యాన్ని ప్రచారంచేసే వారిని, మిడిమిడి జ్ఞానంతో మాట్లాడే వారిని హేన్సన్ ఖండించేవాడు. భగవంతుడిప్రనిధులుగా పోజులుకొడుతూ,దేవుడు వాళ్ళతో చెప్పినట్లుగా బడాయిలు పలుకుతూ,నిర్హేతుక ఉపన్యాసాలు చేసేవారంటే ఆయనకు వళ్ళుమంట. ఈ కోవకు చెందినవాళ్ళు ఎక్కడ, ఏరూపంలో తటస్థపడినా ఎదరించే వాడు.

ప్రభువు ప్రజలను కాపాడుతుంటాడని వాళ్ళ బాగోగులన్నీ ఆసంరక్షకునికే తెలుసని, వ్యాధులను కలిగించే కారణాలు కూడా ఆయన ఆధీనంలోనే ఉంటాయని చాలామంది నమ్ముతారు. ప్రజలకు వ్యాధులంటే భయం వున్నందున ఈ సంజాయిషీలు వారికి ఊరట కలిగించవచ్చు. అజ్ఞానం, అశ్రద్ధ, అశుభ్రతలపట్ల ఎన్నో జబ్బులు వస్తాయని చాలమందికి తెలియదు. జబ్బులకు కారణం తామేనని బాధ్యత తమ మీద వేసుకోకుండా, నిందను ఇతరులపైకి నెట్టివేయడానికి దేవుడిని ఒక మార్గంగా వాడుకుంటారు. ఇది సులభమార్గం. పైగా ఆ భగవంతుడు కూడా

ఇందుకు వాల్ళనేమి అనడం లేదు, అభ్యంతరం చెప్పడంలేదు. కనుక వాళ్ళు అలాగే తమ ధోరణులలో కొనసాగుస్తున్నారు.

ఇక కుష్టు వ్యాధి విషయానికివస్తే భగవంతుడే వాళ్ళకు ఆజబ్బు పంపాడని నమ్మేవాళ్ళు. ఇది తప్పు. కాని వాళ్ళను కాదంటే వప్పుకోరు. అందుకు హేన్సన్ కాస్త లౌక్యంగా ''అవును భగవంతుడే వ్యాధిని పంపాడు. ఆయనే ఈ జబ్బు ఇతరులకు వ్యాప్తి చెందకుండావుంటే మార్గాలను కూడా ఇపుడే తెలియజేశాడు'' అని చెపితే శ్రద్ధగా వినేవాళ్ళు. అంతేకాని ''ఆ మార్గాలను మేము కనుగొన్నాము'' అంటే వినరు. స్త్రీలకు నచ్చజెప్పడం మరీ కష్టంగా వుండేది.

శాస్త్ర విజ్ఞానం పెరిగే కొలదీ, క్రొంగొత్త విషయాలు తెలిసే కొలదీ, ప్రకృతి రహస్యాలుబట్టబయలయ్యే కొలదీ, శాస్త్ర విషయాలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చే కొలది మత బోధకుల వెర్రి మొర్రి అభిప్రాయాలను నమ్మేవాళ్ళ సంఖ్య తగ్గుతుంది. కాలక్రమేణా హేతు దృష్టి పెరిగి చాలా మార్పులు రాగలవని నమ్మేవాడు హేన్సన్. ''మౌఢ్యాన్ని తగ్గించడంలో సరయిన విద్యకు సాటి అయినదిలేదు. మతం కూడా నిలకడగా ఒకే రీతిన ఉండక మార్పులు చెందుతుంది. మధ్యయుగంలో దయ్యాలు, భూతాలు ఉన్నాయని నమ్మేవాళ్ళు ఇవాళ వాటిని నమ్మేవాళ్ళ సంఖ్య బాగా తగ్గిపోయింది'' అనే వాడాయన.

హౌస్ సర్జన్గా శిక్షణ ముగించాక బెర్గెన్ కు వెళ్లాడు. అక్కడి నుండి లోఫోటెస్ దీవులలోని ఉత్తర ప్రాంతానికి వెళ్లాడు. అక్కడజాలర్లకువైద్యం చేయడానికి డాక్టరుగా ఉద్యోగంలో నియమించబడ్డారు. యాంత్రికలోపం వల్ల నౌకాప్రయాణం బాగా అలస్యమై 21రోజులకు గమ్యాన్ని చేరాడు.

ఆయన అక్కడొక వ్యాపారికి చెందిన సెటిల్ మెంట్ లో న్నాడు. అక్కడున్న ఆరువేలమంది జాలర్లకు ఆయనొక్కడే డాక్టరు. హేన్సన్ కు డాక్టరుగా అదే తొలి అనుభవం. చేతి నిండా రోగులుంటే క్రొత్త వైద్యుడికి పండగగానే వుంటుంది. కాని ఒకటే చిక్కు. ఆ అమాయక మొరటు జాలరి వాళ్ళు తమ బాధ ఏమిటోగూడా వ్యక్తం చేయలేరు. పది నిమిషాలు ప్రశ్నలు వేసినా, ఏదో ఒకటి, రెండు జవాబులనే పదేపదే చెప్పేవాళ్ళు.

ఎక్కడైనా నొప్పి పుడితే అక్కడ రక్తం గడ్డ కట్టిందనుకునేవారు. నొప్పి ఇతరచోట్లకు కదులుతుంటే రక్తం పల్చబడుతుందనుకునేవాళ్ళు. వాళ్ళ జీవన విధానం చాలా అనారోగ్యకరంగా వుంటుంది. ప్రతికూల వాతావరణంలోకూడా వేటకు వెళ్ళి జబ్బుపడి వచ్చే రోగులకు తెంపు వుండేడికాదు. ఏమీ తోచనపుడు చర్చికో, డాక్టరు దగ్గరికో వచ్చేవాళ్ళు.

ఒకసారి ఒక కుర్రవాడు వచ్చి తన ముఖమంతా విపరీతంగా నొప్పి పుడుతుందని చెప్పాడు. తీరా పరికించి చూస్తే అతని ముక్కుమీద మొటిమ వుంది. డాక్టర్ హేన్సన్ దాన్ని సున్నితంగా చిదిమివేసి పంపాడు.

''కాడ్'' రకం చేపలవేటలో సాధారణంగా వ్రేళ్ళకు దెబ్బలు తగులుతుంటాయి. అంత బలిష్టమైన శరీరం కలవాళ్ళు కూడాచిన్న ఆపరేషను పరికరాలను చూడగానే భయంతోవణికి పోయేవాళ్ళు. ఒకోసారి డాక్టరు చేతిలోచిన్న కత్తి చూపినా వెక్కిళ్ళు పెట్టి ఏడ్చేవాళ్ళు. కాని దెబ్బతిన్న భాగాన్ని కోస్తుంటే బాధను భరిస్తారు.

కొన్నిప్రాంతాలలో జాలర్లు ఆరోగ్యంగా, శుభ్రంగానే ఉంటారు గాని ఇక్కడ మాత్రం అన్ని విధాల అధ్వాన్నంగా వున్నారు. పైగా సోమరిపోతులు కూడా. ఆదివారాలలో అయిదుగంటల తర్వాత స్వంతగా సముద్రంలోకి వేటకు వెళ్ళి చేపలను పట్టుకొని వాటిని అమ్ముకోవడానికి యజమాని అనుమతి ఇస్తాడు. కాని వాళ్ళు కదలరు. అదేమని అడిగితే 'ఆదివారం విశ్రాంతి దినం. ఆ రోజు వేటాడితే పాపం'' అనేవాళ్ళు.

''అయితే మీరు వడ్డుమీద కూర్చుంటే చేపలువచ్చి మీ వడిలో వాలతాయా? అంటే, ఆ దేవుడే ఏదో రూపంలో ముట్టచెబుతాడు అనేవారు. ''అయితే మీ దృష్టిలో భగవంతుడు అంత తెలివి తక్కువవాడా? మీరు పనిచేయకుండా కూర్చుంటే తిండి పెట్టడానికి అనేవాడు హేన్సన్. అందుకు ఏవో సంజాయిషీలు చెప్పేవాళ్ళు. వాళ్ళు భక్తితో మరేదైనా పనిచేస్తే మెచ్చుకునే వాడే కాని అలా గోళ్ళు గిల్లుకుంటూ గుడిశెలలో కూర్చోవడం హేన్సన్ కు ఇష్టం వుండేదికాదు.

కొన్నాళ్ళ తరువాత మళ్లీ బర్గెన్కు వచ్చాడు. అక్కడ కుష్టువ్యాధి పీడితుల వైద్యానికి నియమించబడ్డాడు. ఆయన జీవితంలో అదొకమంచి మలుపు అయింది. అక్కడ శీతాకాలంలో

చలిబాగా ఎక్కువ. వారికి వంటినిండా కప్పుకోవడానికి సరిపోయే దుస్తులు లేవు. అంతగా దయనీయ పరిస్థితులన్నీ ఒక్కచోట కేంద్రీకరించిబడి వుండటం మునుపెన్నడూ చూడలేదు. క్రమంగా రోగులను పట్టుకొని చూడటం ప్రారంభించాక భయం తగ్గింది. విముఖతా దృష్టి సన్నగిల్లింది. దాని స్థానంలో వ్యాధిని గూర్చి తెలుసుకోవాలనే కోరిక బలియం అయింది. శవ పరీక్షలు ప్రారంభించాడు. దాంతో ఆయన ఆసక్తి మరీ పరిగింది.

ఒకో జబ్బు చేసినపుడు శరీరంలో కొన్ని అవయవాలలో కొన్ని మార్పులు కనబడతాయి. అటువంటి రోగగ్రస్త శరీర నిర్మితి గూర్చి తెలుసుకోవడం ఆయనకు చాలా ఇష్టమైన విషయం. ఎన్నో తెలియని అంశాలను గ్రహించాడు. ఆయనకు తెలిసిన కొన్ని సంగతులు అసలు అప్పటి వైద్య శాస్త్రానికే తెలియవేమొ. కొన్ని నెలలు గడిచాయి. మరణించిన కుష్టు రోగుల శరీర భాగాలను నిశితంగా పరిశీలించాడు. లివర్, స్ప్లీను మున్నగు అవయవాలలో వచ్చే మార్పులను గమనించాడు. ఇంకా ఎన్నో పరీక్షలు చేయాలనుకున్నాడు. కాని సమయం చాలలేదు. అప్పుడే ఒక ముఖ్యమైన అనుభవాన్ని గ్రహించాడు ఆయన.

రోగులు సాధారణంగా తమ బాధలను డాక్టర్లు పట్టించుకోరు అనుకుంటారు. ఇదెంత మాత్రం నిజంకాదు. డాక్టరు తన సానుభూతిని బహిరంగంగా వ్యక్తపరుస్తుంటే సరిగా సేవచేయలేడు. పైగా డాక్టరు ప్రశాంతంగా తన శిక్షణపొందిన కళ్ళ ద్వారా అవగాహనద్వారా రోగిని గమనిస్తూ వ్యాధి నిర్ధారణ చేయాలి. చికిత్సనునిర్ణయించుకోవాలి.

పరీక్షించేటపుడు, చికిత్స చేసేటపుడు కొన్ని సందర్భాలలో రోగికి బాధ కలిగించవలసి వస్తుంది. దాన్ని బట్టి డాక్టరు కఠినడనుకోగూడదు. ప్రజలలోపలురకాల వారున్నట్లే వైద్యులలోనూ పలు మనస్తత్వాల వాళ్ళు ఉంటారు. ఒక డాక్టరును గురించే నలుగురు నాలుగురకాలుగా చెప్పుకోవచ్చు. ఎప్పుడూ డాక్టరుపైన ఆయన దగ్గరకు వచ్చే రోగులు అభిమానమే వుంటుంది.

ఉద్యోగ విధులలో తలమునకలుగా తీరిక లేకుండా పనిచేసినా విరామ సమయాలలో సరదాగా గడిపేవాడు. ఆ యువ బ్రహ్మచారిని పార్టీలకు పిలిచేవారు. అక్కడ ఆనందంగా కాలం గడిచేది. కాని డాన్సు చేతకాకపోవడం కాస్త ఇబ్బందిగా వుండేది. వ్యాయామ విన్యాసాలు బాగా చేయగలడు గనుక డ్యాన్సు కూడా చేయగల ననుకున్నాడు. అవయవాల కదలికలో ఎంత వేగం

వున్నా లయ వుండేదికాదు. ఆయన డాన్సులో, అయినా కబుర్లు బాగా చెప్పేవాడు. రాత్రి ఎంత పొద్దుపోయేదాక మేల్కొన్నా ఉదయమే విధులకు మామూలుగా హాజరయ్యేవాడు.

ఆ క్లినిక్ లో చేరిన ఏడాదిలోగానే కుష్టువ్యాధిని గురించి ఒక వ్యాసాన్ని ప్రచురించాడు. దానితో ఆయనకు ఒక పర్యటనకు స్టయిపండు మంజూరు చేశారు. 1870 సం.ము వసంత ఋతువులో పై చదువులు కొనసాగించడానికి జర్మనీ వెళ్లాడు.

దారిలో ''బాన్''లో ఆగి చాలమందితో విలువైన పరిచయాలు చేసుకున్నాడు. అప్పటికే ఆయన జర్మన్ భాషను మాట్లాడటం నేర్చుకున్నాడు.

మైక్రోస్కోపు విజ్ఞానంతో జర్మనీలోనే ప్రముఖుడైన 'మాక్స్ ఘల్ట్ జ్'' అనే శాస్త్రవేత్తను కలిసి ఆయన దగ్గర ఎంతో ఆసక్తిగా పనిచేశాడు. అక్కడ లేబరేటరీ మాత్రం అంత ఆధునికంగా లేదు. విద్యార్థులకు విషయాలు వివరించడానికి ఇద్దరు అసిస్టెంట్లు ఉన్నారు. కాని వాళ్ళిద్దరికీ కలిసి తెలిసిన దానికంటే హేన్సన్ కే ఎక్కువ తెలుసు. అందుకని చొరవ తీసుకొని అప్పుడప్పుడు హేన్సన్ కూడా పాఠాలు చెప్పేవాడు యనకు గత అనుభవం వుండటంతో అధ్యాపకుడిగా గూడా రాణించాడు. ప్రొఫెసరుగారు ప్రయోగశాలకు అరుదుగా వచ్చేవాడు. వచ్చినప్పుడు గూడా తనకు ఆసక్తిగల అంశాన్ని తప్ప దేనినీ పట్టించుకోడు. అక్కడ మానవ ఎముకలకుసంబంధించిన ఒక నూతన విషయాన్ని కనుగొన్నాడు హేన్సన్ కాని ప్రొఫెసరు దాన్ని గురించి శ్రద్ధ చూపలేదు.

కొన్ని నెలల తరువాత హేన్సన్ తిరిగి నార్వే వచ్చాడు. తరువాత కొద్దికాలానికే అదే అంశాన్ని మరెవరో ప్రచురించారు. తాము ఏ రంగములోనయినా మొదటవారుగా వుండాలి. అనేది జర్మనుల కోరిక, అది అంటుజబ్బులాగా పట్టుకుంది హేన్సన్ ను. తనకు తెలిసిన విషయాన్ని కూడా బయటకు చెప్పుకోలేక వెనకబడిపోయినందుకు బాధపడ్డాడు. చేజారిన అదృష్టానికి చింతించాడు. ఏమైనా సరే చేయవలసిన పని తన ముందుండటంతో అది గులునుత్వరలోనే మరచిపోయాడు.

జూలై నెలలో ఫ్రాన్సుదేశం జర్మనీపై యుద్ధం ప్రకటించింది. దానితో ప్రజలలో శత్రుదేశంపై కోపము, మాతృదేశంపై భక్తి పెల్లుబికాయి. హేన్సన్ ''కోలోగ్నే''కి వెళ్ళవలసి వచ్చింది.

తోటి మానవుడిని చంపడంవల్ల ఆత్మ విశ్వాసం పెరగడం చాలా విచారించవలసిన విషయం. మానవ చరిత్రఅంతా ఇంతే. శాంతిని, నాగరికతను గూర్చి వల్లిస్తూనే వినాశనానికి పథకాలు వేయడం. ఎంత రక్తాన్ని ఏరులుగా పారించినా సరే యుద్ధానికీ, మరో యుద్ధానికీ మధ్య శాంతి కొరకు ప్రయత్నం చేస్తారు మానవులు. అది మానవ నైజంలోని సుగుణం. మళ్ళీ నూతన ఆధ్యాత్మిక ఔన్నత్యాలను చేరుకోగల శక్తి సామర్థ్యాలు వాళ్లకున్నాయి.

యుద్ధ భేరీలు మ్రోగుతుంటే తనపని మీద దృష్టిని కేంద్రీకరించటం కుదరలేదు. ఆ ఉద్రిక్త వాతావరణంలో తాను విదేశీయుడై నప్పటికి నిశ్చింతగాకూర్చొని పనిచేయలేకపోయాడు. అందుకని ''బాన్''ను వదలి ''వియన్నా''కు బయలుదేరాడు. పడవమీద 'బిగెన్' వెళ్ళాడు. అక్కడ డాక్టరుగా తనసేవలు అందించాలనే హఠాత్ నిర్ణయం తీసుకున్నాడు. వెంటనే రెడ్ క్రాస్ కేంద్ర కార్యాలానికి వెళ్ళి తన పేరు నమోదు చేయించుకున్నాడు. ''సార్ బ్రాకెస్'' అనే ప్రాంతానికి వెళ్ళమన్నారు వాళ్ళు.

అక్కడకు చేరుకున్నాడు. అంతకు ముందురోజే అక్కడ యుద్ధం అంతమయింది. జర్మన్ సైన్యానికి ఉన్నంత నిర్వహణా నైపుణ్యం, సామర్థ్యం రెడ్ క్రాస్ కు లేవని గ్రహించాడు. ఆయన సేవలు ఎక్కడ అవసరమొ వాళ్ళకు తెలియదు. తానేయుద్ధరంగానికి వెళ్లాడు. ఇంకా అక్కడ శుభ్రం చేయడం పూర్తికాలేదు. గాయపడిన వాళ్ళను అక్కడినుంచి తీసుకువెళ్ళారు.

కాని హతులైన సైనికుల శవాలు, నేలంతా పరచుకొని వున్నాయి. వాటిమధ్య ఎన్నో రకాల ఆయుధాలు, దుస్తులు, తలపాగాలు వున్నాయి. గుర్రాల శవాలు గుట్టలుగా ఉన్నాయి. వాటి పేగులు బయటకు వ్రేళ్ళాడుతూ భయంకరంగా ఉన్నాయి. సైనికులు కళేబరాలు అంత దారుణంగా లేవు. ముఖాలుకూడా అంత వికృతంగా లేవు. కానికొందరి చేతి వ్రేళ్ళు కొరికి వేయబడినాయి. మనుష్యులలోనూ కొందరు రాబందుల వంటి వాళ్ళుంటారు. అలాంటి వాళ్ళు యుద్ధానంతరం చనిపోయిన సైనికుల ఉంగరాలను దోచుకోవటానికి చేసిన పని అది.

జర్మన్ లకు, దేశభక్తి మెండు, ఒకముసలి వ్యక్తి యుద్ధంలో చనిపోయిన తనకుమారుని శవాన్ని పూడ్చడానికి వచ్చాడు. అతనికి కొడుకు పోయాడన్న దిగులులేదు. మాతృభూమికొరకు అసువులు బాసిన కొడుకును కన్నందుకు తృప్తిగా ఉన్నాడు. ఇలాంటి సంఘటనలుజర్మనీలో ఎక్కువ. అయితే కొన్ని మినహాయింపులు లేకపోలేదు. కొందరు జర్మనులుఅగ్గిపెట్టెలుగూడా ఇతర దేశాలవే మంచివనుకుంటారు.

హైడల్బర్గలో మర్నెన్నో యుద్ధ దుష్ఫలితాలను చూశాడు. అక్కడి మిలటరీ ఆసుపత్రిలో పనిచేశాక యుద్ధం అంటే మరింత ఏహ్యాభావం కలిగింది హేన్సన్ కు.

కొన్నాళ్ళ తర్వాత రైలు ద్వారా ''జూరిచ్'' చే స్విట్జర్లాండు గుండా కాలి నడక సాగించాడు. దారి అడిగి తెలుసుకుంటూ కొండలోయలగుండా ముందుకు వెళ్లాడు. సాల్జ్ బర్గ్ లో ఒక పాత ఇల్లు కనబడింది. ఆ ఇంటితలుపుమీద ''కుష్టువ్యాధి'' అని వ్రాసి వుండి. అంటే ఆ ఇంట్లో కుష్టురోగి ఉన్నట్లు హెచ్చరిక. అది ఆయనకు ఆహ్వానంలాగా కనిపించింది.

ఆస్ట్రియన్ రాజధాని అందంగా, ఆకర్షణీయంగా వుంది. అక్కడ నార్వే దేశపు డాక్టర్లు కూడా చాలామంది చదువుకుంటున్నారు. మధ్నాహ్న భోజనాల దగ్గర వాళ్ళందరూ కలుసుకున్నారు. సాయంత్రాలలో సరదాగా కాలక్షేపం చేసేవాళ్ళు.

జీవితంలో ముఖ్య సంఘటన

వియన్నా దేశస్తులు చాలా కలుపుగోలు మనుషులు. ఎంత మౌనంగా ఉండే వాళ్లనయిని ఎంతో పరిచయస్తులలాగా మాట్లాడిస్తారు. అక్కడ ఉండగా హేన్సన్ జీవితంలో ఒక ముఖ్య సంఘటన జరిగింది. ఆయన మామూలుగా ఒక పుస్తకాల షాపుకు వెళ్లాడు. అక్కడ చార్లెస్ డార్విన్ వ్రాసిన ''ప్రకృతి పరిణామం'' అను పుస్తకాన్ని చూశాడు. ఆపుస్తకం పేరు ఆయన్ను ఆకర్షించింది. అప్పటికి సృష్టి గురించి తాను నేర్చుకున్న విజ్ఞానాన్ని అంతటినీ సవాలు చేస్తున్నట్లు వుందా పేరు. ఇంటికి వెళ్ళి రెండు రోజుల పాటు లేబరేటరీ పనిని గూడా పట్టించుకోకుండా ఏకబిగిన దాన్ని పూర్తిగా చదివాడు.

అంతకు ముందు అలాంటి గ్రంథానిన చదవలేదాయన. అది చదివాక ప్రపంచమే సరిక్రొత్త వెలుగులో కనపడసాగింది. తాను బాల్యం నుంచి నేర్చుకున్నది మంచులా కరిగిపోయింది. ఇంతకాలం తాను నడచివచ్చిన పట్టాలు ఆగిపోయాయి. పట్టాలకు అవతల ఏమీ కనిపించని అగమ్యం. అయితే ఒకటే ఉపశమనం. తన శాస్త్రీయ పరిశాలనా శక్తి వల్ల ఆ రెండు రోజుల్లో తనకు కలిగిన మానసిన షాక్ ను లీనం చేసుకోగలిగాడు. అదొక విప్లవాత్మక మార్పు.

మరలా మామూలు పనిలో నిమగ్నమయ్యాడు. ప్రశాంతంగా పరిశోధన కొనసాగించి తరువాత నార్వేకు వెళ్ళాడు. డార్విన్ రచనలను క్షుణ్ణంగాచదివాడు హేన్సన్. జీవితం అంటే ఏర్పడిన నూతన భావాలకు అవి పునాదులు అయ్యాయి. నార్వే లాంటి చిన్న దేశాలు బయటి ప్రపంచంలోని ప్రముఖ అభివృద్ధినికూడా తెలుసుకోలేక అజ్ఞానంలో ఉన్నాయని గ్రహించాడు. డార్విన్ పేరు, ఆయన రచనల పేర్లు కూడా హేన్సన్ అంతవరకు వినలేదు. నార్వే ప్రజలకు ఆయనను పరిచయం చేయాలనుకున్నాడు. 'బెర్గెన్ పోస్ట్ ' అను పత్రికకు డార్విన్ ను గురించి కొన్ని వ్యాసాలు వరుసగా వ్రాశాడు.

డార్విన్ సిద్ధాంతాలను గూర్చి స్థూలంగా చాలామందికి తెలిసినా సూక్ష్మంగా అందులోని లోతులు బహు కొద్దిమందికే తెలుసు. ''పరిణామ సిద్దాంతంలో ఏమున్నది? అదంతా పాత కాలానిదే అని పెదవి విరిచే వాళ్ళు లేకపోలేదు. ప్రపంచ ప్రజలు ఆ సిద్దాంతంలోని గొప్పతనాన్ని ఇంకా గ్రహించలేదు.

సృష్టిని గురించి గతంలో ఎవరో, ఏదో, కొంచెం, కొంచెంగా చెప్పారు. కాని ఒక క్రమ విధానంలో జీవితము, ప్రాణులు, ఉత్పత్తి వంటి మౌలిక అంశాలపై డార్విన్ లాగా సహేతుకంగా చెప్పినవాళ్ళు లేదు.

సహజంగా ఒక సమస్యకు పరిష్కార మార్గం దొరకాలంటే విభిన్న మేధావుల దృక్పథాలను విశ్లేషించి చూడాల్సి ఉంటుంది.

జీవిత మర్మాలను తెలుసుకునే ప్రయత్నంలో విఫలమైన ప్రజలే దేవుడిని సృష్టించారు. అతడే సర్వవ్యాప్తి, సర్వోత్కృష్టుడు అన్నారు. అతడే ఆది, అంతం అన్నారు. అది మధ్యాంతరహితుడని

కూడా అన్నారు. కాని వాళ్ళొక విషయం విస్మరించారు. దేవుడు అనేవాడు వుంటే అతనికైనా మూలం వుండి తీరాలి గదా.

వియన్నాలో వుండగా వుండగా ప్రొఫెసరు హైబర్గు వచ్చి హేన్సన్ గదిలో ఒక వారం రోజులున్నారు. వెళుతూ హేన్సన్ కు బహుమతిగా వెనిస్ కు రాను పోను టిక్కెట్ట్ కొని ఇచ్చాడు. ఆ అవకాశాన్ని జారవిడుచుకోకుండా ఇటలీకి బయలుదేరాడు. వెనిస్ చేరాక ఒక చిన్న పడవలో గ్రాండ్ కాలువ అంతటా విహరించాడు. మరుసటిరోజు మిత్రులను కలుసుకున్నాడు. ఆ కాలువవద్దునున్న శిధిల భవనాలు అంత అందంగా కనిపించలేదు మొదట్లో. కాని కొద్ది రోజుల తర్వాత వాటిలో గూడా సౌందర్యం కనపడసాగింది. దాంతో తానొక అనాగరికుడనా ఏమిటి అని సందేహం కలిగింది. శాస్త్రం,మతం విషయాలలో లాగానే కళాత్మకదృష్టిలోనూ మొండి వైఖరి వాళ్ళుంటారనుకున్నాడు.

వియన్నాలో ప్రజలు ముఖ్యంగా స్త్రీలు అందంగా వుంటారు. కాని వారు ఇటాలియన్ల తారువానే. అక్కడ హేన్సన్ చాలా విషయాలు నేర్చుకున్నాడు. వారి స్నేహశీలత సాటిలేనిది. వచ్చీరాని ఆయన భాష వాళ్ళకు నవ్వు తెప్పించేది. వాళ్ళు ఓపికగా ఆయనకు అర్థమయ్యే విధంగా మాట్లాడారు. బాషను మాట్లాడుతూ తదనుగుణంగా శరీరభాగాలు కదలించడంనేర్చుకున్నాడు. వెనిస్ నుండి వియన్నాకు వచ్చి ఒక వారం వుండి తర్వాత బెర్లిన్ చేరాడు. స్వతహాగా ఆయనకు మాతృ భూమి అంటే మక్కువ ఎక్కువ.

ఎన్నో నూతన అనుభవాలు, అనుభూతులతో ఇంటికి వచ్చాడు. అందులో మత సంబంధమైనవి కొన్ని. ప్రార్థనల పేరుతో ఏదేదో గొణుక్కోవటం, ఊరేగింపులు చేయడం ఆయనకు నచ్చదు. అంతకు మించిన తెలివి తక్కువ పని లేదనుకున్నాడు.

వెనిస్ లో చూసిన ప్రార్థన మరో రకం. ఆ సామూహిక ప్రార్ధన చదివే విధానం చాలాబాగుంది. ప్రార్ధనను సంగీతంతో మేళవించి పాటగా పాడుతుంటే అందులోని లయ శ్రోతలకు తన్మయం కల్గిస్తుంది. మోకరిల్లిన భక్తులు కొందరు కునికిపాట్లు కూడాపడేవాళ్ళు. ఇలా రకరకాలుగా భగవంతుని ఆరాధించడం ఎందుకో ఆయనకు తెలిసేదికాదు. ఏమైనా ప్రార్ధన

చదవటం, తర్వాత ఆర్గన్ వంటి వాద్యాలు మోగడం మాత్రం ఆయనను స్పందింపజేసింది. ఆయన హేతువాది. ఐనప్పటికీ కాథొలిక్ ప్రార్ధనల్లోని పై అంశాలను మెచ్చుకునేవాడు.

అధ్యయనానికి గ్రాంటు

ఇంటికి వచ్చినప్పటికి నుండి శ్రద్ధగా తన పనిలో నిమగ్నమయ్యాడు. త్వరలోనే కుష్టు వ్యాధిని గూర్చి గ్రామీణ ప్రాంతాలలో అధ్యయనం చేయడానికి మరొక గ్రాంటు ఆస్లోలోని మెడికల్ సొసైటి వారి ద్వరా ఆయనకు మంజూరు అయింది.

విదేశీ పర్యటనల వల్ల ఆయన ఆశించినంతగా ఫలితాలు లభించలేదు. అనుకోకుండా జరిగిన మేలు డార్విన్ గ్రంథాల పరిచయం కావటమే. వాటి ద్వారా శాస్త్ర పరిశోధనకు, హేతుబద్ధమైన ఆలోచనకు మూల సూత్రాలు గ్రహించాడు. ఆయన లోచనలను, కృషిని అంతగా సారవంతపరచిన అంశము మరేదీ లేదు. డార్విన్ లాగా నిజాయితీగా, సంకుచితముగాకాని మనస్సుతో పరిశోధన చేయడం ఆయన ఆశయం. ''సిద్ధాంతీకరించేటపుడు కూడా ఆయనలాగా జాగ్రత్తగావుండాలి. డార్విన్ మహాశయుని రచనలు ఈనాడు కూడా ప్రతి పరిశోధనకుడు చదివితీరాలి. కనీసం అందులో ఒక గ్రంథాన్నైనా చదివితే అధ్యయనానికే కాక జీవితానికి కూడా ప్రయోజనం కలుగుతుంది'' అనే వాడాయన.

విదేశయాత్రలో సంస్కృతి, లలితకళలు గూర్చి పలువురు సంస్కార వంతులతో చర్చించే అవకాశం కలిగింది తరువాత వాటిపట్ల ఆయనకు సరిక్రొత్త దృక్పథం ఏర్పడంది.

1870 ప్రాంతంలో కుష్టు వ్యాధిని కలిగేం కారణమేమిటో తెలుసుకోవాలనే తపన అధికము కాసాగింది ఆయనకు. కొందరు శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాలు పొరపాటని హేన్సన్ కనుగొన్నాడు. ప్రొఫెసరు లాక్మన్ అభిప్రాయాలను సవాల్ చేస్తూ హేన్సన్ ఒక వ్యాసం వ్రాశాడు. నిజినికి లాక్ మన్ అసలు పరిశోధకుడు కాదు. ఆయన ఈ వ్యాధి గురించి చదవలేదు కూడా. తర్కించి చూస్తేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సమ్మేవాళ్ళలో ఆయన ఒకడు. అది పాత కాలపు నమ్మకం. మరీ జీవశాస్త్రంలో అది నిరాధారమైనదని తేలింది.

కాని డేనియల్ సన్ విషయంలో అలా కాదు. ఆయన హేన్సన్ కు పై అధికారి. అంతేకాదు ఆయన ప్రథమ శ్రేణి శాస్త్రవేత్త కూడా. ఆయన దగ్గర పనిచేయడం అరుదైన అనుభవం. వయస్సు మళ్ళీన వాడైనా ఉత్సాహంతో యువకుడిలా కనిపిస్తాడు. ముందుగానే ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకునేవాడు గాదు. కచ్చితమైన శాస్త్రీయ దృష్టి ఆయనది. పట్టు విడవకుండా హేన్సన్ ను పరిశోధన చేయమని ప్రోత్సహించే వాడు. ప్రతిరోజూ ఆసుపత్రి నుంచి ఊళ్ళోకి వెళుతూ వివిధ విషయాలను చర్చించే వాడు హేన్సన్.

కుష్టువ్యాధి చరిత్ర

హేన్సన్ పరిశోధన చేయడానికి ముందు ప్రపంచంలో కుష్టు వ్యాధిని గూర్చి వ్యాప్తిలోనున్న ఊహాలు, అపోహాలు, జరిగిన ప్రముఖ సంఘటనలు చూద్దాం. ఇన్ని అపోహాలు చరిత్రలో మరే వ్యాధి పట్ల గూడా లేవేమొ.

క్రీస్తుకు పూర్వం 1500 సం..ము ప్రాంతంలో భారత దేశంలో ''రుగ్వేద సహిత''లో కుష్టు వ్యాధికి మరికొన్ని చర్మ వ్యాధులకు కలిపి ''కుష్టు'' అనుపదం వాడబడింది. తరువాత పాలస్తీనా దేశంలో ఈ వ్యాధి ఉన్నట్లు ఆధారాలు లభించాయి ఈజిప్టులో తాళపత్ర గ్రంథాలలో ఈ వ్యాధి గూర్చి వుంది. ఇది అసలు చావుకు ముందుగా వచ్చే చావు అనుకునేవాళ్ళు ఈజిప్టు ప్రజలు. శతాబ్దాల తరబడి ఈ వ్యాధిని గురించి పలుప్రాంతాల ప్రజలు భయకంపితులయ్యారు. హెబ్రూలు, రోమనులు దీనిగురించి వ్రాశారు.

క్రీ.పూ.880లో వ్యాధి రాకుండా చూసుకే మార్గాలను భారతీయుల 'మనుస్మృతి' సూచించింది. రోగుల బిడ్డలతో వివాహాలను నిషేధించింది. ''శుభ్రత సంహిత''లో ఇంత వివరంగా వుంది. ''వ్యాధులన్నిటిలో చెడ్డవ్యాధి. దీనితో చనిపోయినవాడు మరుజన్మలో కూడా అదే వ్యాధితో పుడతాడు. ఇది అంటువ్యాధి. మొక్కల వ్రేళ్ళు నేలలోకి చొచ్చుకు పోయినట్లుగా వ్యాధి చర్మం నుంచి శరీరపు లోపలి అవయవాలకు ప్రాకుతుంది'' అని వుంది.

క్రీ.పూ.5వ శతాబ్దిలో పర్షియారాజు హిరోడోటస్ ఈ వ్యాధి గాని, తెల్ల చర్మముగాని ఉన్న వాళ్ళను పట్టణంలోకి రానివ్వగూడదని ఇతరులతో కలవగూడదని, క్రొత్త ప్రాంతపు రోగి వస్తే దేశం బయటకు తరిమి కొట్టాలని శాసించాడు.

గ్రీసులో కూడా వ్యాధి కనిపించింది. అరిస్టాటిల్ దీనిని ఉదహరించాడు. క్రీ.పూ. 300 సం..లో బైబిలు పాతనిబంధనలోని హెబ్రూ పదం ''జారత్''ను ''లెప్రసీ'' అను పదంగా ఆంగ్లంలోకి అనువదించారు. రమణీయ ప్రకృతికి, ప్రశాంత వాతావరణానికి పేరుగాంచిన నైలు లోయలో క్రీ.పూ.99-54 సంవత్సరాల మధ్యకాలంలో ''భయంకర కుష్టు వుంది. అక్కడ మాత్రమే ఉంది'' అన్నారు.

కుష్టురోగులు ప్రభువు సన్నిధిలో అపరిశుద్ధులు కారని, దేవుని కరుణా కటాక్షాలను వీరుగూడా సమానంగా అర్హులేనని తన జీవితకాలంలో బోధలద్వారా, ఆచరణ ద్వారా ఏసుక్రీస్తు తెలియజేశాడు.

సైనికులు, నావికులు అంటువ్యాధులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వ్యాపింప చేస్తుంటారు. క్రీస్తుశకం 62 సం..ము నాటికి రోమను సైనికులు ద్వారా ఈ వ్యాధి యూరప్లో ప్రవేశించింది. క్రీ.శ. 100 నుండి 900 సం..రాల మధ్య ' ఆయుర్వేద శుశ్రుతం'లో 'భాగవతం' లో విషముష్టి నూనెను ఈ వ్యాధి చికిత్సను సూచించారు.

ఈ జబ్బు అతిచల్లని ప్రాంతమైన ఐస్లాండ్ లోనూ ఉంది. ఉష్ణ దేశమైన ఇండియాలోనూ ఉంది. జనసాంద్రత తక్కువగా ఉన్నచోట్ల ఉంది. క్రిక్కిరిసిన ప్రాంతాల్లోనూ ఉంది. బైబిల్ లో, తాల్మూద్ అనే మత గ్రంథంలో చికిత్స చేయడానికి సాధ్యంకాని ప్రతిచర్య వ్యాధినీ ఈ పేరుతో వ్రాశారు. హేబ్రూలకు మంచి వైద్యులే ఉన్నారు కాని తీవ్రమైన జబ్బులు దేవుని శాపంవల్ల వస్తాయని నమ్మేవాళ్ళు. నివారణకు మార్గము ప్రార్థన అనునేవాళ్ళు. పాత బైబిల్ లోని లేవియ కాండలో, మరికొన్ని చోట్ల ఈ వ్యాధి ఇళ్ళకు, వస్త్రములకు గూడా సోకుతుందని వున్నది. రోగులను వెలివేసేవాళ్ళు, ఖైదీలకన్నా హీనంగా చూసేవాళ్ళు. జర్మనీలో, చైనాలో వ్యాధి లక్షణాలను గురించి గ్రంథాలలో వ్రాశారు.

క్రీ.శ. 5-6 శతాబ్దాలలో రోమను సైనికుల ద్వారా స్పెయిన్ ను దేశానికి వ్యాపించింది. 625-638 కాలంలో ఇంగ్లాండులో నాటంగ్ హాంలో మొదటి కుష్టురోగుల ఆసుపత్రిని ప్రారంభించవలసి వచ్చింది. 625 నుంచి 1798 వరకు దాదాపు 12 శతాబ్దాల పాటు బ్రిటన్ లో వ్యాధి మహా ఉధృత రూపం దాల్చింది.

హెబ్రూలు బోధించిన ఆరోగ్య సూత్రాలను అంతా మరచిపోయారు. కాని కుష్టు రోగుల పట్ల విధించిన నిషేధాలు మాత్రం మరువలేదు. రోగి చింకి బట్టలతో, చింపిరి జుట్టుతో వుండాలి. నోటికి చెయ్యి అడ్డం పెట్టుకొని 'అపరిశుద్ధుడు' అని అరుస్తూ వెళ్ళాలి. ఒంటరిగా ఊరి బయట నివసించాలి. కుష్టురోగి బ్రతికివున్నా చనిపోయినట్లే పరిగణించి అతనికి అంత్యక్రియలు నిర్వహించేవారు. ప్రజలు రోగులను రాళ్ళతో కొట్టి తరిమి వేసేవాళ్ళు. రోగుల విషాధ అరుపులతో వీధులు మార్మోగేవి.

రోగులు అసంఖ్యాకంగా పెరిగిపోయారు. ఎక్కడిచూసినా రోగులే. ధనికుల్లో రోగులు ఎలాగో పోషించ బడేవాళ్ళు. పేద కుటుంబాల నుంచి వచ్చిన రోగులస్థితి మరీ విషమంగా వుండేది.

క్రీ.శ. 640 సంవత్సరంలో చైనాలో వెలువడిన ''వెయ్యి అమూల్య ఔషధాలు'' అనే గ్రంథంలో ఈ జబ్బు గూర్చి ఒక అధ్యాయం వుంది. ''600 మంది రోగులకు చికిత్స చేయగా 60 మందికి వ్యాధి తొలగిపోయింది. మందులు ఎక్కువ కాలం వాడాలి. పథ్యం కఠినంగా వుండాలి. కర్పూర చెక్క పొడి ఔషధంగా పనిచేస్తుంది'' అని వ్రాసివుంది.

క్రీ.శ. 720-759ల మధ్య స్విస్ లో ''లె ప్రాశారియం'' లు స్థాపించబడ్డాయి. ఇవేరోగుల శరణాలయాలు. 757లో ఫ్రాన్సులో రోగితో వివాహం చట్టవిరుద్దం చేశారు. దంపతుల్లో ఎవరికైనా రోగం వస్తే వాళ్ళు విడాకులు తీసుకోవాలి. 701-750 సం..రాల మధ్య జపాన్ రాణి రోగుల సంక్షేమం పట్ల శ్రద్ధ చూపింది. ఈ రోగుల కొరకు మొదటి ఆసుపత్రిని ''నారా'' అనే చోట ఏర్పాటుచేశారు.

క్రీ.శ. 1000-1400 సంవత్సరాల మధ్య యూరప్ లో వ్యాధి విశ్వరూపం దాల్చింది. ఈ సమయంలో మతబోధకులు శ్రద్ధ వహించారు. వీరు చొరవ తీసుకొని కృషిచేసి తమ

నివాసాలలోనే రోగులకు నీడ కల్పించారు. ఫ్రాన్సులో 13వ శతాబ్దంలో ఇలాటివి రెండు వేల దాకా ఉన్నాయి. ఇంగ్లాండులో 200 స్థాపించబడ్డాయి. అతిధిని దేవుడిలాగా చూడాలనే ఆచారాన్ని బట్టి కుష్టురోగి వచ్చినా ఈనివాసాలలోకి రానిచ్చారు. రోగులను పోషించ సాగారు. క్రమంగా ఈ నివాసాలను నిర్వహించడమే గగనమై పోయింది. రాజులు కొంత సహాయం చేశారు. ఇందుకు ప్రత్యేక పన్నులు వేశారు. కానుకలు ఇచ్చారు. చరిత్రలో మొదటిసారిగా ఈ సత్రాలలోనే రోగుల పట్ల ప్రేమ చూపబడింది. వారికి సరైన తిండి, గుడ్డలు దొరికాయి. నీడలో వుండే వీలు కలిగింది.

క్రీ.శ. 1067లో స్పెయిన్ లో రోగులకు శరణాలయం నెలకొల్పారు. 1285-1312 మధ్యకాలంలో ఫ్రాన్సురాజు నాల్గవ ఫీలిప్ రోగులందరినీ ఒక చోటకి చేర్చి కాల్చి వేయాలని అదేశించాడు. వ్యాధి దేశంలో లేకాం పోయే వరకు అలాగే చేస్తుండాలన్నాడు.

1400-1410 సం..రాలలో నార్వే లోని బెర్గెన్ లో ఆసుపత్రి స్థాపించారు.

క్రీ.శ. 1484-92 సం..రాలలో ''సెయింట్ లాజరస్'' అనే యోధులను 8వ పోప్ అణగ ద్రొక్కాడు. వారినందరినీ బలవంతంగా కుష్టు రోగుల సేవకు వినియోగించాడు. వాళ్ళలో చాలామందికి వ్యాధి అంటుకుంది.

1595లో చైనాలో ఈ వ్యాధి చికిత్సకై ఒక మూలికను సూచించారు. భారతదేశంలో 'మాధవ నిదానం' లో పూర్వజన్మలో చేసుకున్న పాపంవల్ల ఈ వ్యాధి వస్తుందన్నారు. వ్యాధి నివారణకు ఔషధ సేవనంతో పాటు బంగారం దానం చేయడం, సూర్య దేవుని ఆరాధించడం అవసరం అన్నారు.

16 నుంచి 18 శతాబ్దాలలో పోర్చుగల్ నుంచి బ్రెజిల్ కు స్పెయిన్ నుంచి కొలంబియా, ఈక్వెడార్, క్యూబా, మెక్సికో, అమెరికా సంయుక్త రాష్ట్రాలకు ఆఫ్రికా నుంచి జమైకా, దక్షిణ అమెరికాకు వ్యాధి వ్యాపించింది.

1716లో జపాన్ లో చాల్ ముగ్రా విత్తనాలను చికిత్సకు వాడారు. 1823లో హవాయ్ దీవులలో వ్యాధి వ్యాప్తి చెందింది. పేదరోగులను చనిపోయేదాకా వుంచే వాటినే అసుపత్రులు అనుకునేవాళ్ళు. రోగులను వేరుచేసి కాలనీలలో వుంచసాగారు. ఆ కాలనీలు ప్రత్యక్ష నరక

కూపాలు. జైలు శిక్షకు భయపడని అలవాటుపడ్డ ఖైదీలు కూడా కాలనీ పేరు వింటే అదిరి పడేవాళ్ళు. 1866లో హవాయి దీవులలోని మొలకాయ్ దీవిలో మూడు ప్రక్కల నీళ్ళు, ఒక ప్రక్క కొంత నేల వుండే చోట రోగులక కాలనీ ఏర్పాటు చేశారు. జీవితాంతమూ రోగులు అక్కడే వుండాలి. రోగులను ఏరి ఏరి తెచ్చి అక్కడ వుంచేవాళ్ళు.

1847లో నార్వే దేశంలో డేనియల్ సన్,బోయస్ శాస్త్రవేత్తలు ఈ జబ్బు వంశం ద్వారా వస్తుందని ప్రతిపాదించారు. 1844, 1856 సం..రాలలో డేనియల్ సన్ కుష్టురోగి శరీరం నుంచి తీసిన పదార్థాలను తన శరీరంలోకి ఎక్కించుకున్నాడు. మరి 9 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారికి గూడా ఎక్కించారు. అయినా వాళ్ళకు వ్యాధి సోకలేదు. 1848లో డేనిష్ ప్రభుత్వాధికారంలో డేనియల్ సస్ సిద్ధాంతంచేత ప్రభావితులై ఇది అంటువ్యాధి కాదనుకొని అంతవరకు వున్న 4 ఆసుపత్రులను మూసివేశారు.

1854లో చాల్ ముగ్రా నూనెనుపాశ్చాత్య వైద్యంలో చికిత్సకు వాడారు. మంచి ఫలితాలు కనపడ్డాయి. 1855లో చైనాలో, 1857లో భారతదేశపు బెంగాల్ లో ఈ చికిత్సను ప్రారంభించారు.

1863లో హుచిన్ సన్ అనే శాస్త్రజ్ఞుడు ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. సరిగా నిల్వ చేయని, క్రుళ్లిపోయిన చేపలను తినడం వల్ల ఈ వ్యాధి వస్తుంది అన్నాడాయన.

1863-75 మధ్య కాలంలో ప్రాఫిటా, కాగ్నినా అనే పరిశోధకులు తమకు తాము, మరి 8 మంది వలంటీర్లు రోగుల నుంచి సేకరించిన పదార్దాన్ని తమ శరీరాలలో ప్రవేశపెట్టుకున్నారు. ఐనా వ్యాధి రాలేదు.

ఈ పరిస్థితుల తరువాత హేన్సన్ తన పరిశోధన చేయబూనాడు. శక్తి వంచన లేకుండా, సంకుచితం కాని మనసుతో అన్వేషణ ప్రారంభించాడు. వ్యాధికి మూలకారణం తెలుసుకుందామని పల్లె ప్రాంతాలకు వెళ్ళేవాడు. చాలా సందర్భాలలో రోగులు ఏమీ సమాచారాన్ని ఇవ్వగలిగేవాళ్ళు కారు. ఇచ్చే వాళ్ళు కూడా లేరు. కాని కొందరు మాత్రం బాగా జవాబులు చెప్పారు. ఈ వ్యాధి వంశం ద్వారా వ్యాపించదు అనే అభిప్రాయం ఆయనలో బలపడసాగింది. ఈ జబ్బుకు కారణం,

దీన్ని అదుపుచేసే విధానం తెలుసుకోవడం మానవ సాధ్యమే అనిపించింది. రెండు సంవత్సరాలు ముందు వేసవి కాలాల్లో విసుగు విరామం లేకుండా గ్రామాలలో తిరిగాడు. కొన్ని ఆధారాలు దొరికాయి. తాను వెతుకుతున్న శత్రువు సూక్ష్మజీవి రూపంలో వుంటుందని నమ్మకం కలిగింది.

రకరకాల సూక్ష్మజీవులు రకరకాలు వ్యాధులను కలిగిస్తాయని అప్పటికే తెలిసినా ఇంకా ఆ శాస్త్ర విభాగం అంతగా ప్రచారంలోకి రాలేదు. సూక్ష్మ జీవులు శరీరాలను శుష్కించజేస్తయనుకునేవారు. 1628 సం..లో విలియం హార్వే రక్త ప్రసరణ రహస్యాన్ని వెలువరించాడు. 1683 లో లూయన్ హాక్ అనే డచ్ దేశస్తుదు మైక్రోస్కోపు ద్వారా బ్యాక్టీరియాను చూపించాడు. తరువాత జె.ఎఫ్.గాల్ మెదడు నిర్మాణాన్ని, నాడీ మండలం కేంద్రంగా మెదడు ప్రాధాన్యతను వివరించాడు. స్విట్జర్లాండుకు చెందిన ఏ.వి. హాలర్ శరీర ధర్మశాస్త్రాన్ని రూపొందించాడు.

1796లో ఎడ్వర్డ్ జెన్నర్ మొదటిసారిగా టీ కాల మందు కనుగొన్నాడు. తరువాత లివరు పని గూర్చి, గర్భస్త పిండం గూర్చి, కొన్ని వివరానలు, పులియడానికిగల కారణాలను కనుగొన్నాడు. స్టెతస్కోపును, ఆపరేషన్ల సమయంలో వాడే మత్తు మందు ఈథర్ను, క్లోరోఫామ్ ను వివిధ శాస్త్రజ్ఞులు కనిపెట్టారు.

1860లో లూయీ పాశ్చర్ సూక్ష్మ జీవులు వ్యాధుల కారకాలని కనుగొన్నాడు. ఆంథ్రాక్స్, వెర్రికుక్క కాటుకు టీకాల మందు కనుగొన్నాడు. జోసెఫ్ లిష్టర్ కార్బాలిక్ యాసిడ్ ఆపరేషన్ల సమయంలో యాటిసెప్టిక్ గా పనిచేస్తుందని నిరూపించాడు. 1872 ఫెర్డినాండ్కాన్ బ్యాక్టీరియాలజీ శాస్త్రాన్ని పునాదివేశాడు.

హేన్సన్ పరిశోధన చేసే నాటికి ఆధునిక వైద్యంలో మైలురాళ్ళ వంటిది ఈ సంఘటనలు.

సూక్ష్మ జీవులు వ్యాధిని కల్గిస్తాయనే నమ్మకంతో తాను పరిశోధన కొనసాగించాలనే ఆలోచన ఆయనను ఊపిరి సలపనీయలేదు. కుష్టు వ్యాధి ఒకరినుంచి మరొకరికి సంక్రమిస్తుందనే నమ్మకం ఆయనకు కుదిరింది. ఇందుకు ఏదో క్రిమికారణం అయివుంటుంది. దానిని కనిపెట్టాలి. అందుకోసం ఆయన ఎంతో ఓపికగా పనిచేశాడు. కళ్ళు లాగుతున్నప్పటికీ లెక్కచేయకుండా

గంటల తరబడి కూర్చొని మైక్రోస్కోపులో చూసేవాడు. కొద్ది కాలంలోనే సూక్ష్మజీవుల కణాలు కనిపించాయి. తరువాత విరామం లేకుండా పరీక్షలు కొనసాగించాడు. ఒక్కోరోజు ఇంకేముంది, ఇదుగో కచ్చితంగా సూక్ష్మజీవి దొరికింది' అనుకునేవాడు. కాని మరుసటిరోజే అది అదృశ్యమయేది. మళ్ళీ మళ్ళీ ఎన్నోసార్లు అలాగే దాగుడుమూతలు ఆడుకునేది. ఐనా డైరీలో ఒక వాక్యం వ్రాసుకున్నాడు. ''కుష్ఠురోగులకు వచ్చే బుడిపెలలో సూక్ష్మజీవులు కనిపించాయి. అవే వ్యాధి రావడానికి కారణం. అంతకు మించి ఏమీ వివరాలు చెప్పలేను' అని.

కుష్టువ్యాధి క్రిములవల్లనే వస్తుందని నిరూపించాలంటే ప్రతి కుష్టురోగిలోనూ ఈ క్రిములను చూపగలగాలి. ఆరోగ్యవంతుల్లో ఈ క్రిములను ప్రవేశపెడితే వారికి ఈ జబ్బు రావాలి. అయితే కుష్టు క్రిములను కుక్కలు, పిల్లులు, కుందేళ్ళు, కోతులు చేపలలో ప్రవేశపెట్టి చూశాడు హేన్సన్. ఫలితముఏమీ కానరాలేదు. వాటికి ఈ జబ్బు రాలేదు. డా.. కోచ్ క్షయ వ్యాధిని కల్గించే క్రిములను కనుగొన్నాడు. హేన్సన్ కు అది తెలిసి ఉత్సాహం పెల్లుబికింది. కుష్టు క్రిములను మానవ శరీరంలో ప్రవేశపెట్టి చూడాలనుకున్నాడు. ఆలోచనను ఎలా అమలు పరచాలా అనున్నాడు.

రోగులు సమాజంలోని ఆరోగ్యవంతులతో కలువకుండా వేరుగా ఉండమని ఆయన హెచ్చరించేవాడు. అందుకు రోగులు ఆయనపైన అయిష్టత చూపేవాళ్ళు.

ఆసుపత్రిలో ఒక రోగికి గల వ్యాధి బుడిపెలో నుంచి ద్రవాన్ని ఇంజక్షన్ సూదితో తీశాడు. వ్యాధి అంత తీవ్రంగా లేని మరో స్త్రీరోగికి కంటిలో ఆ ద్రవాన్ని ఎక్కించారు. ఆ సంఘటన అక్కడి రోగుల్లో సంచనలం కల్గించింది. అక్కడ ఉండే పాష్టరు ఈ విషయాన్ని ఆసుప్రతి సూపర్ వైజరీ బోర్డుకు ఫిర్యాదు చేశాడు. బోర్డువారు డాక్టరు హేన్సన్ ను, ఆ ఆడరోగిని ప్రాధమిక విచారణ జరిపారు. కేసును న్యాయశాఖకు నివేదించారు.

ఆ రోగికి అప్పుడు 33 ఏళ్ళు. తన 16వ ఏట నుంచి ఆసుపత్రిలో వుంటుంది. ఆమె కంటిలో సూదితో గుచ్చడంవల్ల కొన్ని రోజులు నొప్పి చేసింది. చూపు కొంచెం బూదరగా ఉన్నట్లనిపించింది. ఏ డాక్టరయినా, శాస్త్రజ్ఞుడయినా తానొక ప్రయోగమొ,పరిశోధనో చేయదలిస్తే ముందుగా రోగికిదానిని గురించి తెలియజాయలి. అది వృత్తి ధర్మం. కాని హేన్సన్ అలా చెప్పలేదని అంగీకరించాడు. అది పొరపాటు. చెపితే ఆమె ఈ దృష్టితో తీసుకోకపోవచ్చునని

చెప్పలేదన్నాడు. అలా గ్రుచ్చడం వల్ల మహా అయితే కంటిలో ఒక పూతలాగా రావచ్చుననని, అలావస్తే దాన్ని ప్రారంభదశలోనే చిన్న ఆపరేషను ద్వారా తీసేయవచ్చునని ఆయన ధైర్యం.

దీని గూర్చి విచిరాంచిన బెర్లిన్ ప్రధాన న్యాయమూర్తి హేన్సన్ పై నేరారోపణ చేశాడు. రోగికి ఉన్నరకం జబ్బుకంటే తీవ్రమైనరకపు వ్యాధిని ఆమెలో కలిగించాలని ప్రయత్నించడం. అమాయకులైన వ్యక్తిపై శారీరక హాని కల్గించిన నేరాన్ని ఆరోపించారు. న్యాయశాఖ ఒక నిర్ణయానికి రాబోయే ముందుగా నగర మెడికల్ ఆఫీసరును పబ్లిక్ హెల్త్ డైరక్టరును సలహాఅడిగారు.

ఆయన హేన్సన్ ను సమర్థించాడు. పరిపాలనా నిర్వహణ పరంగా అతనిది తప్పు. అందుకు అతనికి గట్టి హెచ్చరిక ఇవ్వాలి. కాని ఈ ప్రయోగాన్ని చేసింది న లాభం కొరకుకాదు. దేశానికి, శాస్త్రరంగానికి, కుష్టురోగుల స్థితిమెరుగుపరచడానికి ఉపయోగపడే ఒక ముఖ్యమైన ప్రశ్నకు జవాబు తెలుసుకోవడానికి అలాచేశాడు. ఈయన ఇంతకుముందే ఈ విషయంలో విశిష్టమూన కృషిచేసి వున్నాడు కూడా.

న్యాయశాఖ ఈ వాదనలను విన్నది. ఉన్నత ప్రభుత్వోద్యోగి తన పదవిని దుర్వినియోగపరచి, ఎవరికైనా హానికలిగిస్తే అందుకు శిక్షగా అతనిని ఆ పదవి నుంచి తొలగించాలి. హేన్సన్ ప్రధాన కుష్టు వైద్యాధికారిగానూ, కుష్టు రోగుల ఆసుపత్రిలో డాక్టరుగానూ రెండు పదవులను నిర్వహిస్తున్నాడు. ఆయన డాక్టరుగా పొరపాటు చేశాడు. కనుక ఈ రెండు పదవులను వేరు చేశారు. ఆయన ప్రధాన వైద్యాధికారిగా పదవీ నిర్వహణలో చేసిన లోపము లేదు. గనుక ఆ ఉన్నత పదవిలో వుండవచ్చునని క్రింది పదవియైన ఆసుపత్రి డాక్టరుగా ఆయనను తొలగించాలని చెప్పారు. ఖర్చులకుగాను 90 క్రొనార్లు ఆయన చెల్లించవలసి వచ్చింది.

ఏ దేశంలోనైనా ఎంత గొప్ప వ్యక్తి అయినా సరే న్యాయం ముందు తలవంచాలని నిరూపిస్తుంది ఆయన ఈ కేసు.

ఆ క్రిములను కృత్రిమంగా తయారు చేయడానికై అప్పటికి తెలిసిన ప్రాథమిక పద్దతుల ద్వారానే ప్రయత్నించాడు. కొద్ది రోజులకు ఒక క్రొత్త ఆశాకిరణం కనిపించింది. వైగర్ట్, కోచ్ అనే

శాస్త్రజ్ఞులు క్రొత్త రసాయన రంగు విధానాలను కనిపెట్టారు. వాటిని వాడిచూశాడు. అవీ ఉపయోగపడలేదు. మళ్ళీ నిరాశే మిగిలింది.

ఆ విధంగా కుష్టు క్రిములను కనుగొనాలని కుస్తీపడుతుండగా ప్రొఫెసరు నైజరు కుష్టు వ్యాధిని గూర్చి పరిశీలిస్తూ బెర్గెన్కు వచ్చాడు. ఆయన కూడా వైగర్డ్, కోచ్ పట్టణానికి చెందినవాడే. అందువల్ల ఆయన తనకు సహాయపడతాడని ఆశించాడు హెన్సన్. అంతవరకు జరిగిన పనిని ఆయనకు చూపాడు. కాని రంగులు వేయడంలో ఆయనకూ పెద్ద అనుభవం లేదు.

కాని జర్మనీకి ఆయన తిరిగి వెళ్ళాక హెన్సన్ ఇచ్చిన రసాయనాలతో క్రిములకు రంగువేయగలిగాడు. ఈలోగా హేన్సన్ తనపరిశోధనలు కొనసాగించాడు. రాబర్ట్ కోచ్ తో నేరుగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ఆయన సలహామీద క్రొత్తవిధాన్నిక్షుణ్ణంగా నేర్చుకున్నాడు హేన్సన్.

కుష్టువ్యాధిని కల్గించేవి సూక్ష్మ జీవులని నిరూపించడానికి చేయవలసిన కృషి చాలావుంది. ఆయన ఒక్కడు నమ్మితే చాలదు. దాన్ని రుజువులతో అందరికీచూపగలగాలి. కనుక అటువంటి అధారాలు దొరికేవరకు ఆయన పరిశోధనలను త్వరపడి ప్రచురించాలని ఆరాటపడలేదు. కాని నైజర్ అలా అనుకోలేదు. ఆయన వెంటనే ప్రచురించాడు. అయితే యన నిజాయితీతో చాలా విషయాలను హేన్సన్ చెప్పాడని ఒప్పుకున్నాడు. అంతకు ముందుగా నార్వే మేగజైన్ ఆఫ్ మెడికల్ సైన్సులో హేన్సన్ ఆవిష్కరణను ప్రచురించారు. తన శిష్యుడైన హేన్సన్ కష్టించి కనుగొన్న పరిశోధనా ఫలితాన్ని నైజర్ దొంగిలించే ప్రయత్నం చేశాడని డేనియల్ సన్ కు కోపం వచ్చింది.

ఈ పరిస్థితుల్లో ఈ అంశాన్ని జర్మన్ పత్రికలలో ప్రచురిస్తే మంచిదని భావించాడు హేన్సన్. అలాగే చేవాడు. అది హేన్సన్ పరిశోధనగానే ప్రచారం పొందింది. తరువాత అన్ని వైద్య గ్రంథాలలో కూడా ఇప్పటికీ కుష్టు వ్యాధిని హేన్సన్ వ్యాధిగా పేర్కొంటారు.

హేన్సస్ కు అహంకారము, దురాశలు లేవు. సంవత్సరాల తరబడి అన్వేషణలో ఆయన లోనయిన సందిగ్ధత చాలా పెద్దదే. అయితే ఆయన తన వ్యక్తిగత విజయానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ఈ వ్యాధి చుట్టూ ఉన్న చిక్కుముడులను, జవాబులేని ప్రశ్నలను పరిష్కరించడం

ముఖ్యం అనుకున్నాడు. అవి తిస్తే వ్యాధి వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.అదివంశం ద్వారా, తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే జబ్బు అయితే చేయగలిగిందేమీలేదు. ఒకరినుంచి మరొకరికి అంటుకునే జబ్బు అని తెలిస్తే చాలా చేయవచ్చు. దాన్ని అరికట్టడానికి.

నార్వే దేశంలో వ్యాధి వ్యాప్తిని తగ్గించడానికి కొన్ని విధానాలను పాటిస్తున్నారు. వీటిద్వారా రోగుల సంఖ్య గణనీయంగా తగ్గినట్లుగా తనవిశ్లేషణ ద్వారా గమనించాడు హేన్సన్. దీనితో ఇది అంటువ్యాధి అని వాదించడానికి ఆధారం దొరికింది. అదృష్టవశాత్తు శఆసన నిర్మాణంలో పలుకుబడి గల వైద్య డైరెక్టరు గూడా ఈ అభిప్రాయాలతో ఏకీభవించాడు. అంతవరకూ అమలులో వున్న చట్టాలను కొన్ని సవరణలు చేశారు. కుష్టురోగులను సాధారణ ఆసుపత్రులలో వుంచరాదని శాసించారు. తరువాత 1885 లో అలాంటి రోగులను కుటుంబానికి కూడా దూరంగా వుంచాలని నిర్దేశించారు. అలా వీలుకాకపోతే రోగులను శాశ్వతంగా కుష్టు ఆసుపత్రిలో చేర్చాలని శాసించారు.

ఇందుకు ప్రజలలో తీవ్రమైన వ్యతిరేకత పెల్లుబికింది. మనుషులను ఈ రకంగా వెలివేయడం అమానుషం అని ప్రతిఘటించారు. భగవంతుని శాపం వల్ల నో లేక మరేదో కర్మవల్ల ఈ జబ్బు వచ్చినంత మాత్రాన వాళ్ళకింతటి కఠినశిక్ష వేయగూడదన్నారు. అందుకు హేన్సన్ ‘‘నిజమే రోగులను మానవతా దృష్టితో చూడాలి. అలాగే ఆరోగ్యవంతులను కూడా చూడాలి కదా ఆరోగ్యవంతులు ఎక్కువమంది కనుక వారి శ్రేయస్సు కోరి అలాచేయక తప్పదు’ అని సమర్థించుకున్నాడు.

నిజానికినార్వే దేశంలో కుష్టురోగులు ఆదరంగానే చూడబడుతున్నారు. శాసనాల అమలువల్ల రోగుల సంఖ్య తగ్గడంతో ఆ ఘనత అంతా హేన్సన్ కు ఆపాదించారు. దీనికి ఆయన అంగీకరించడు. ఎందుకంటే ‘కొన్ని నివారణ చర్యలు నా చిన్న తనంనుంచే అమల్లో ఉన్నాయి. వ్యాధికి కారణాన్ని కనుక్కోగలగడమే నా అదృష్టం’ అంటాడు. మొత్తానికి మునుపు ఉన్న రక్షణ సూత్రాలు మంచివనీ, ప్రయోజనకరమైనవనీ నిరూపించగలిగాడు. తన దేశానికి కొంతమేలు చేయగలిగానని, తన జన్మ కొంత వరకు సార్థకమయిందని తృప్తిచెందాడు.

ఆయన కీర్తి ప్రతిష్ఠలు విస్తరించాయి. అయనొక ప్రసిద్ధ వ్యక్తి అయ్యాడు. 1897లో బెర్లిన్ లో జరిగిన అంతర్జాతీయ కుష్టు వ్యాధి సమావేశంలో ఈ విషయం ప్రసుఫటమయింది. ఈ క్రొత్తగా వచ్చిన కీర్తి ఆయనకు కాస్త ఇబ్బంది పెట్టింది. ఆయన కనుగొన్న అంశం అంత గొప్ప స్తాయికి చెందినదనుకోలేదు. కాలక్రమేణ ఏదో ఒకరోజు తెలియవలసిన సత్యమే అది. ఏ శాస్త్ర విషయ అన్వేషణలోనైనా నా కఠినశ్రమ, సక్రమ ఆలోచన వుంటే సత్ఫలితాన్ని సాధించవచ్చు. శాస్త్రజ్ఞులలో కొందరు అదృష్టవంతులు కూడా ఉన్న మాట నిజమే. మరికొందరు అజ్ఞాత విషయాలను పూర్తిగా క్రొత్త దృక్పదంతో వీక్షించి మొక్కవోని దీక్షతో ఆయా రంగాలలో విశిష్ట వ్యక్తులుగా రూపొందారు. అలాటి వాళ్ళు నిజంగా గొప్పవాళ్ళు.

నార్వే దేశపు రైతుల నుంచి తన పరిశోధనకు అవసరమైన సమాచారాన్ని సేకరించేటపుడు హేన్సన్ కు మంచి అనుభవాలు కలిగాయి. ఆయన త్వరత్వరగా ఎక్కువమందిని ప్రశ్నించాలనుకునేవాడు. తానెవరో ఏమేమి సమాచారం ఎందుకు కావాలో కాస్త క్లుప్తంగా వాళ్ళకు ఉపోద్ఘాతంగా చెప్పకుండా నేరుగా ప్రశ్నిస్తే జవాబులు చెప్పేవాళ్ళు గారు. కనుక సహనం అలవరచుకొన్నాడు.

ఈ జబ్బు ఎందుకు వచ్చిందో తెలుసా అంటే వాళ్ళు ' అది కావలసి వచ్చింది' 'దేవుడు నాకు ఇచ్చాడు' అనేవాళ్ళు ఇలాటి మతపరమైన నిర్హేతుక విశ్వాసాల వల్ల బాధ్యత నుంచి తాము తప్పుకొని మరెవరో బయట వారిని కారకులను చేస్తారు. ఒక్క కుష్టు వ్యాధికే కాదు. అన్ని జబ్బులకూ, దురదృష్టాలకూ కూడా తమను బాధ్యులను చేసుకోరు. నావికుడి పొరపాటు వల్ల, చేతకానితనంవల్ల పడవ మునిగిపోయినా అది అతని పొరపాటు కాదంటారు. సృష్టికర్తకేదాన్ని ఆపాదిస్తారు. నిజానికి తన బాధ్యతను అంగీకరించడానికి చాలా ధైర్యం కావాలి. రోగికి గల ఏ మతపరమైన అభిప్రాయాన్ని గూడా అవమానపరచడం ఆయన అభిమతం కాదు.

కుష్టువ్యాధి గూర్చి అయన వ్రాసిన ప్రారంభవ్యాసాలు అటూ ఇటూ గాని సంకర భాషలో ఉన్నందున అయన తర్కము నిరూపణలు బయటి ప్రపంచానినిక అంతగా తెలియలేదు. కనుక వాటిని జర్మన్, ఇంగ్లీషు భాషలలో వ్రాయాలనుకున్నాడు. మనసుంటే మార్గం ఉండకపోవచ్చు

అన్నట్లు డిక్షనరీని దగ్గర పెట్టుకొని పదాలను అర్థాలను వెదుక్కుంటూ వ్రాశాడు. అది చాలా విసుగు కలిగించే విధానమేగాని ఆయన సామర్థ్యానికి మంచిది కాదు.

చాలామంది వైద్యులు, శాస్త్రవేత్తలు హేన్సన్ సిద్ధాంతాన్ని నమ్మారు. అయినా దాన్ని పూర్తి ఆధారాలతో నిరూపించాల్సి వుంది. వ్యాధి వంశపారంపదర్యంగా వస్తుందనే వాళ్ళు, రాదనేవాళ్ళ మధ్య వివాదాలకు ఇంకా తెరపడలేదు. కనుక ఈ విషయాన్ని ఇంకా లోతుగా పరిశీలించాలి. గతంలో దాదాపు 200 మంది కుష్టు రోగులు కూడా ఇతరులతో పాటు నార్వే నుంచి అమెరికాలోకు వలస పోయారు. అక్కడకు వెళ్ళి వాళ్ళ పరిసరాలను పరిశీలిస్తే ఆయన సిద్ధాంతానికి బలం చేకూర వచ్చుననుకున్నాడు. నార్వే పార్లమెంటుకు విజ్ఞప్తి చేశాడు హేన్సన్ పర్యటనకు నిధులను మంజూరు చేయమని,పార్లమెంటు ఏమి ఆలోచించిందో, ఎందుకో తెలియదు గాని ఆ ప్రతిపాదనను తిరస్కరించింది.

కొన్ని నెలల తరువాత సెయింట్ పాల్ లోని హెన్సన్ మిత్రుడొకరు అమెరికా యాత్రకు ఖర్చులన్నీ భరిస్తానన్నాడు. 1828 జనవరిలో న్యూయార్కుకు బయలుదేరాడు. 16 రోజుల ప్రయాణం అనుకూల వాతావరణంలో బాగా సరదాదా సాగింది.

సెయింట్ పాల్కు చేరుకోగానే ఆయనకు సాదరస్వాగతం లభించింది. డాక్టర్ బాక్ మస్ దంపతులు హేన్సన్ కు అతిధ్యం ఇచ్చారు. చలికాలమంతా వారి ఆఫీసులోనే తాను వ్రాతపని చేసుకున్నాడు. మరొకగదిలో వారివద్దవున్న పరికరాలతో తన ప్రయోగాలు కొనసాగించాడు. చలికాలంలో విపరీతమైన చలి. ఒకోసారి మంచుగడ్డ కంటే చల్లగా -30^0 సెంటిగ్రేడు కూడా వుండేది. అయినా ఇళ్ళలోపల వెచ్చగా వుంచేవాళ్ళు.

వేసవి రాగానే పరిశోధనకై గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాడు. అక్కడ ఇద్దరు డాక్టర్లు వారు చూసిన రోగుల వ్యాధి వివరాలను కేసు షీట్లలో వ్రాసి వుంచారు. వాటి ద్వారా ఆయా రోగుల వ్యాధి పెరుగుతుందో, తగ్గుతుందో గ్రహించవచ్చు. ఆ కేసు షీట్లు ఈయనకు బాగా ఉపయోగపడ్డాయి. వేసవి చాలా వేడిగా వుండేది. అయినా గ్రామాలలో తరిగి పలువురు నార్వే దేశస్తులను కలుసుకున్నాడు. ఆ కొత్త దేశంలో తన దేశస్తులు బాగా నిబద్రోక్కుకోవడం చూసి ఆనందించాడు. ఇక్కడకు వచ్చాక రైతులు పరిశుభ్రత, కఠిన శ్రమనేర్చుకున్నారా అనిపించింది. వాళ్ళ ఇళ్ళు

పరిశుభ్రంగా ఉంచుకొన్నారు. నార్వ్ లో రైతులు ''తీరిక లేదు'' అనడం ఆయన వినలేదు. కాని అమెరికాలో చాలాసార్లు అలా అన్నారు. ఒకోసారి కనీసం పావుగంట మాట్లాడే అవకాశం ఇమ్మని వాళ్లను అభ్యర్థించవలసి వచ్చేది.

''మతపరమైన ఛాందన భావాలు ఇంకా ప్రబలి ఉన్నప్పటికీ మానవాళి ఉజ్వల భవిష్యత్తు వైపు పురోగమిస్తుందని నా విశ్వాసం. ప్రాచీన తత్వవేత్తలు ఇప్పటి వారికంటే మేధావులు అని చాలామంది నమ్ముతారు. కాని ఒక మౌలిక భేదం వుంది. ఆనాటికీ, ఈనాటికీ తెలిసిన ప్రపంచ పరిధులలో ఎన్నో రెట్ల వ్యత్యాసం వుంది. నేటి మానవుల ఆలోచన మరింత యదార్థమైనదిగా, విశ్వవ్యాప్తంగా వుంటుంది. ప్రాచీన పండితులు కూడా మనలాగానే ఆలోచించేవాళ్ళు. అయితే మానవవికాసాన్ని ఒక దశ నుంచి మరొక కేవలం ఆలోచనలే తీసుకుపోలేవు.

సోక్రటీసును ఒక మేధావి విమర్శించాడు 'ఆయన చేసిందేవమీ లేదు. ఊరకే మాట్లాడేవాడు' అని. అది నిజమే ఆ అమరగ్రీకు తత్త్వవేత్త విజ్ఞానాన్ని వికసింప చేయకపోవచ్చు. కాని ఆయన తర్కంతో ఆలోచించాడు. తరచి తరచి చూశాడు. మానవుని విమర్శనాశక్తికి, విశ్లేషణా శక్తికి ఆయన ఆదర్శం. సోక్రటీసుకు ముందుకూడా విమర్శ వుండే వుంటుంది. కాని దానికి క్రమపద్ధతి, ఒక విధానం కల్పించిన ఘనత మాత్రం ఆయనకే దక్కాలి.

ఆధునిక మానవుల మెదడు పూర్వీకుల మెదడుకంటే బాగా అభివృద్ధి చెందుతుంది. పరిణామంలో భాగంగానే నాగరికత, సాంస్కృతిక రంగాలలో పురోగతి ఖచ్చితంగా నిరూపించగమెుమో? హోమర్ వ్రాసిన 'ఇలియడ్' అనే ప్రాచీన గ్రంథంలో కొన్ని రంగుల గురించి మాత్రమే వర్ణనలున్నాయి. నీలి రంగుకూ, ఊదా రంగుకూ తేడా ఉన్నట్లు అప్పటి వారికి తెలియదు. ఇప్పటికీ కొన్ని అటవిక తెగల ప్రజలు ఈ రంగుల మధ్యగల తేడాలను గుర్తించలేరు. ఇదంతా హోమర్ కాలం నాటికంటే నేటి మానవుని మెదడు వికవించడం వల్లనే జరుగుతుంది. ఈ పురోగమనం కొనసాగుతూనే వుంటుంది.

మనిషి ఇలా పెరుగుతూ ప్రకృతినేపూర్తిగా జయించగలడా అనే ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టం. అయినా అందుకొరకే ప్రయత్నిస్తున్నాం. విజయం లభించాలంటే అన్ని రంగాలలో ఇంకా చాలా విజ్ఞానం పెరగాలి.

ఇవన్నీ హెన్సస్ అభిప్రాయాలు. అమెరికాలో పరిశోధన ముగించుకొని వెళ్లాక 1902లో ఆయన్ను లండన్ కు ఆహ్వానించారు. అక్కడ వ్యాధిపై చర్చ ప్రారంభించాడు. ఇంగ్లీషులో ప్రసంగం చేయడం ఇబ్బంది అనుకున్నాడు. కాని విషయం బాగా తెలిసింది కావడం వల్ల, చెప్పదలచుకొన్న విషయ పరిధి స్పష్టంగా ఉండటం వల్ల నిలదొక్కున్నాడు. ఆ చర్చలో ఏ ఒక్క ప్రతినిధి కూడా విషయాన్ని వదిలి మాట్లాడలేదు. వాళ్ళందరి అభిప్రాయాలు వినడంతో ఆయనకు జ్ఞాన వికాసం కలిగింది.

హెన్సస్ ను తరచుగా అంతర్జాతీయవైద్యసమావేశాలకు నార్వేప్రభుత్వ ప్రతినిధిగా పంపుతున్నారు. బెర్లిన్ లో తానొక ప్రముఖ వ్యక్తిగా పేరు అందుకుంటున్నాడు. అందుకు మొదట్లో కాస్త ఇబ్బందిపడ్డాడు. క్రమంగా అభిమానుల ఆరాధనకు అలవాటు పడ్డాడు. తర్వాత అందులో ఆనందం కూడా పొందగలిగాడు. అయితే అది ప్రమాదకరమైనదికూడా. పలువురు వ్యక్తులు వారివారి ప్రత్యేక పద్దతులు ద్వారా అభిమానించే వాళ్ళు.

ఈ భూగోళం విషపురుగుల నిలయం అని ఆయన ఎప్పుడూ అనుకోలేదు. యన జీవితంలో బాధల కంటె ఆనందాలనే ఎక్కువ అనుభవించారు. 40 సంవత్సరాల తర్వాత క్రమంగా ఆయన ఓపిక తగ్గసాగింది. పని ఆపలేదు. కాని మునుపటి వేగం లేదు. నూతన బావపరంపరల ప్రవాహవేగం తగ్గింది.

''నా జీవిత కాలంలో తెలిసిన ఇద్దరు వ్యక్తులు మావవాళి మౌలిక ఆలోచనలో, ప్రకృతిని అర్థం చేసుకోవడంలో విప్లవాత్మక మార్పులను తెచ్చారు. ఒకరు లూయీ పాశ్చర్, ఆయన కొనుగొన్నది సూక్ష్మ క్రిమి విజ్ఞాతు. మానవుల ఆరోగ్యముపై సూక్ష్మజీవుల ప్రభావం తెలియజేసే శాస్త్ర విభాగమే బ్యాక్టీరియాలజీ. దీని ద్వారా వ్యాధుల నిర్ధారణకు, నివారణకు నిక్కచ్చియైన పద్ధతులను కనుగొనే వీలయింది. పాశ్చర్ కృషి ఆధారంగా కల క్రమంలో అన్ని జబ్బులనై కాకపోయినా, అంటు వ్యాధులనయినా అరికట్టగలము. జబ్బులు, దేవుడు, లేక దేవుళ్ళ అగ్రహం వల్ల వస్తాయనే నమ్మకాలను వమ్ముచేశాయి పాశ్చర్ పరిశోధనలు.

రెండవవాడు డార్విన్. ఆయన చెప్పిన పరిణామక్రమం అంతకు ముందున్న అజ్ఞానపు ఆలోచనలను అంతరింపజేస్తుంది. ఆయన సిద్దాంత ప్రతిపాదన ప్రేరణాపూరితమైన ఒక ఊహ

మాత్రమే. ఐనా అది ఆయన జీవితకాలపు కృషి సర్వము. విజ్ఞాన సమ్మతం కాని దానిని దేనిని అంగీకరించకుండా, యదార్థాల ఆధారంగా తేల్చిన, కచ్చితమైన ముగింపులను తెలుసుంటూ రాజీ లేకుండా కృషి చేసి, తన సిద్ధాంతానికి అనుకూలంగా ఆధారాలను సేకరించడమే ఆయన గొప్పదనం. అసంఖ్యాక సాధ్యాసాధ్యాలను ఊహించాడు. వాటికి ఆధారాలు దొరికేవరకు వ్యక్తం చేయలేదు. ఆయనకు సాహసం ఉంది. దాని వెనుక సక్రమమైన లోతైన పునాదులున్నాయి. అని వ్రాసుకొన్నాడు హేన్సన్ తన డైరీలో.

హెన్సన్ తన జ్ఞాపకాలను వ్రాస్తూ అందులో వ్రాసిన చివరి పేరా ఎంతో ముఖ్యమైనది. దాన్ని చూద్దాం.

''మానవుని మేధస్సు ఎందాకా అభివృద్ధి చెందుతుందో ఊమించటం కూడా కష్టమే. కనుక మానవాళి పయనించవలసిన దూరానికి హద్దులు నిర్ణయించడం శుద్ధ బుద్ధిహీనత. ప్రస్తుత మానవుడు పోరాడి తెలుసుకోలేని అన్ని చిక్కుముడులను రాబోయే తరాలవారు విప్పగలరనే ఆశ నాకు ఈ వృద్ధాప్యంలో ఊరట కల్గిస్తుంది.

నేను మౌలికంగా ఆశావాదిని. యువతరానికే భవిష్యత్ కాలమంతా అని ఎప్పుడూ ప్రశంసించగలను. భావి నిర్మాణ కర్తలు వారే. అంతిమ విజయం వారిదే.

నా జీవితకాలంలో వచ్చిన మరో రెండు విప్లవాత్మక మార్పులు. ఒకటి మహిళా స్వేచ్ఛ, సమానత, రెండు శ్రమజీవులకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు.

జీవితంలో మంచిని పొందినవాళ్ళు ప్రస్తుత సమాజ వ్యవస్థ మంచిదే అనుకోవడం సహజం. అయితే సమాజపు నీలినీడల్లో మనిలేవాళ్ళు దీనిని అంగీకరించరు. అదీ సహేతుకమే. వాళ్ళ స్థితిని మెరుగుపరచుకోవడానికి వాళ్ళు కూడా ప్రయత్నం చేయాలి. అలా సమానత సాధించే ప్రయత్నమే సోషలిజం. అయితే ప్రస్తుతం ఉన్న తీవ్ర రూపంలో అది విజయం సాధిస్తుందనుకోను. క్రమంగా సవరించిన దృక్పథం ద్వారా మాత్రమే లక్ష్యాన్ని చేరగలరు. ప్రతి మనిషి తెలివితేటలలో, ఉత్పత్తి చేయడంలో, ఉత్పత్తి ఫలాలను అనుభవించడంలో సమానుడు కావడం అసాధ్యం.

మద్యపానం గూర్చి రెండు మాటలు చెపుతాను. పాత కాలంలో నలుగురు కలిసి పండుగ చేసుకుంటే స్పృహలేనంత దాకా తాగటం అలవాటుగా వుండేది. ఇపుడు ఆల్కహాల్ పానీయాలు (బ్రాందీ, విస్కీ, జిన్,రన్, బీరు వగైరాలు) వల్ల దుష్ఫలితాలున్నాయని నిర్ధారణ అయింది. మానసిన అనుభూతులను,చర్యలను అవి మొద్దు పరుస్తాయి. మనిషికి ఉన్న అదృష్టం సంయమనం, స్వీయ క్రమశిక్షణ. అది మందగిస్తే మనలోని పశుత్వం, విశ్వాసాల హోరం బయటకు వస్తాయి.

నా వరకు మద్యం అసలు తీసుకోను, ఆరోగ్యరీతాయ నాకు మంచిది కాదన్నారు. వృద్ధాప్య చిహ్నాలు నన్ను బాధిస్తున్నాయి. రక్తనాళాలు దళసరికావడం వల్ల డాక్టర్లు నన్ను మద్యం తీసుకోవద్దన్నారు. ఇది నిజమని నిరూపించబడిన సత్యం కాదు. కాని అది అబద్ధమని నేను రుజుతు చేయలేను. కనుక నేను దాని జోలికి పోలేదు.

ఈ నా జీవిత జ్ఞాపకాల ప్రతిబింబాలను భవిష్యత్కు చెందిన తేజోవంతమైన ఆలోచనతో ముగిస్తాను.

ఆ తరువాత 1912 సం..ము ఫిబ్రవరి 12న హేన్సన్ మరణించాడు. ఆయన ప్రారంభించిన పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇంకా కుష్టు వ్యాధి గురించి తెలుసుకోవలసింది ఎంతో వుంది. కేవలం శాస్త్ర రంగంలోనే కాక సేవారంగంలో క్రొత్త పుంతలు త్రొక్కాలి మనం.

హేన్సన్ తరువాత

1843లోనే డాక్టర్ హేన్సన్ కుష్టువ్యాధిని కలిగించే క్రిములను కొనుగొని ప్రపంచానికి చెప్పగలిగాడు. కానీ ఈ వ్యాధి చికిత్సకు చాల్ ముగ్రా నూనె తప్ప సమర్థవంతమైన మందులు లేవు. 'డాప్యాను'' అనే సల్ఫోను మందు బిళ్లలు ఈ వ్యాధిని అదుపుచేయగలవని 1945లో అమెరికాలో కనుగొన్నాడు. అయితే ఈ మందును వ్యాధి తీవ్రంగా వున్న రోగులు జీవితాంతమూ వాడవలసివచ్చేది. వ్యాధి తీవ్రంగా వున్న రోగులు జీవితాంతమూ వాడవలసివచ్చేది. వ్యాధి కొద్దిగా ఉన్నవారు కూడా 3,4 సంవత్సరాలు మందు తినాలి. గత పదహేనేళ్ళ నుంచి బాగా పనిచేసే రిఫాంపిసిన్, క్లోఫాజమైన్ వంటి మందులు వచ్చాయి. వీటివల్ల చికిత్స కాలము 6 నెలలు మొదలు 2 సంవత్సరాలు మాత్రమే సరిపోతుంది. దీనిని బహుళ ఔషధ చికిత్సా విధానం


అంటారు. ప్రపంచంతో వ్యాధి ఎక్కువగా వున్న దేశాలలో ఈ విధానాన్ని అమలు చేయటం ద్వారా రోగుల సంఖ్య గణనీయంగా తగ్గుతున్నది. అయినా ఇంకా ఏటేటా ఎంతోమందికి క్రొత్తగా ఈ వ్యాధిసోకుతుంది. రోగులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్సచేయటం సులువు. ఇపుడు ఇది ఎంతమాత్రమూ భయంకరమైన వ్యాధికాదు. రోగి యొక్క అశ్రద్ధ మాత్రమే అనర్థాలకు మూలము అవుతుంది.


* * *





CENTENAIRE DE LA DECOUVERTE DU BACILLE DE LA LEPRE
1873 ~ 1973
POSTE AERIENNE
REPUBLIQUE DU MALI
200F
GERHARD ARMAUER HANSEN


ພຣະຣາຊອານາຈັກລາວ
ROYAUME DU LAOS
80K
Dr GERHARD HANSEN
POSTES
CENTENAIRE DE LA DECOUVERTE DU BACILLE DE LA LEPRE 1873-1973


REPUBLIQUE POPULAIRE DU BENIN
POSTES 1987
G. HANSEN
R. FOLLEREAU
LUTTE CONTRE LA LEPRE
200F



REPUBLIQUE FRANCAISE
0,45
POSTES
1973
HANSEN
CENTENAIRE DE LA DECOUVERTE
DU BACILLE DE LA LEPRE


SOVRANO MILITARE ORDINE DI MALTA
D. ARMAUER HANSEN - 1841-1912
2 TARI'
POSTE MAGISTRALI
1973


G·H·ARMAUER HANSEN
LEPRABASILLENS
OPPDAGER 1873
NORGE
1.40


G·H·ARMAUER HANSEN
LEPRABASILLENS
OPPDAGER 1873
NORGE
1.00


DR.HANSEN
डॉ॰ हानसेन
कुष्ठ कीटाणु खोज की शतवार्षिकी
पै.
50
भारत INDIA
CENTENARY OF THE DISCOVERY OF LEPROSY BACILLUS


20P
CENTENARY OF THE DISCOVERY
OF LEPROSY BACILLUS (1973)
POSTAGE
پاکستان
PAKISTAN
DR.GERHARD HANSEN